ప్రజాశక్తి

శనివారం 26 నవంబర్ 2022

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

యథాతథమేనా..!

◆ గత జెడ్‌పి సర్వసభ్య సమావేశాల్లో చర్చకు రాని ప్రజా సమస్యలు ◆ తెచ్చినా పరిష్కారంకాని వైనం
◆ కెజిహెచ్‌లో పోస్టు మార్టంకు ఆగని డబ్బుల వసూళ్లు ◆ నేడు 2023-24 అంచనా బడ్జెట్
◆ తగ్గనున్న రూ.173 కోట్ల ఆదాయం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు విశాఖలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరుగనుంది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ప్రజల ప్రధాన సమస్యలపై చర్చకు వేదికైన ఈ సమావేశాన్ని కొద్ది కాలంగా యాంత్రికంగా నిర్వహిస్తున్నారు. జిల్లా అభివృద్ధి అంశాలపై ఏకాభిప్రాయానికొచ్చి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్న ఆలోచన ఏ కోశానా సభ్యులకు కనిపించడంలేదు. కొంతమంది సభ్యులు ప్రస్తావించిన విషయాలు ప్రాధాన్యత సంతరించు కున్నవైనప్పటికీ, రాజకీయంగా చర్చకు అవకాశంలేకుండా మరుగునపడేలా చేస్తున్నారు. సమావేశంలో అధికార బలం చూపడం తప్ప సభ్యులు లేవనెత్తిన ప్రజల సమస్యలను వినడానికి వారికి కనీస సమయం ఇవ్వని పరిస్థితివుంది. మండల స్థాయిలో పరిష్కారంకాని, ఎన్ని విజ్ఞప్తులు, విన్నపాలు చేసినా పరిష్కారానికి నోచని అంశాలను జిల్లా పరిషత్ సమావేశంలో ప్రస్తావించే ప్రయత్నం కొంతమంది సభ్యులు చేస్తున్నా, వారికి అవకాశంలేకుండా కొంతమంది అధికార పార్టీ ఎమ్మెల్యేలు చేస్తున్నారు. అసెంబ్లీలో చర్చించాల్సిన విషయాలను, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలను ఎమ్మెల్యేలు జిల్లా పరిషత్ సమావేశంలో ప్రస్తావించి అధిక సమయాన్ని తీసుకుంటున్నారు. తరగతుల విలీనం, ఉపాధ్యాయులు సరిపడా లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు ప్రయివేటు పాఠశాలలకు వెళుండటంపై ఆగస్టు 30న జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో అనంతగిరి సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు, కొయ్యూరు జెడ్‌పిటిసి నూకరాజు ఆందోళన వ్యక్తం చేశారు. అయినప్పటికీ తరగతుల విలీనం కాకుండా తీర్మానం చేసి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం సమావేశం చేయలేదు.

నాడు-నేడు రెండో దశ పాఠశాల నిర్మాణాలు నిధుల్లేక పూర్తికాలేదు. ప్రాథమిక, సిహెచ్‌సి, ఏరియా, జిల్లా ఆసుపత్రుల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలన్నీ జరగని పరిస్థితి కొనసాగుతోంది. కెజిహెచ్‌లో పోస్టుమార్టం చేసేందుకు డబ్బులు వసూళ్లపై ఎఎంసి ప్రిన్సిపాల్‌తో విచారణ చేపట్టి, చర్యలు తీసుకుంటామని విశాఖపట్నం జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున చెప్పినప్పటికీ, బాధిత కుటుంబాల నుంచి డబ్బులు వసూళ్లు యథాతథంగానే జరుగుతున్నాయి. బాధితులకు ఆ క్షోభ నుంచి విముక్తి లభించలేదు. భూముల రీ సర్వే ఆశించిన స్థాయిలో ముందుకుసాగడంలేదు. భూ ఆక్రమణలు, అక్రమ క్వారీ తవ్వకాలు ఆగడంలేదు. ఆక్రమణలు నియంత్రించేలా తగిన చర్యలు ప్రభుత్వం యంత్రాంగం చేపట్టకపోవడంతో నగర, అనకాపల్లి పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల ఆక్రమణలు కొనసాగుతూనే మిగతా 2లో..



జెడ్‌పి చైర్‌పర్సన్ సుభద్ర



ఆనందపురం మండలం బోనిలో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు

కొంపముంచిన వర్షం

రైతాంగానికి తీవ్ర నష్టం

వార్తలు లోపలి పేజీల్లో..

ప్రభుత్వ విధానాలపై ఎస్‌డబ్ల్యుఎఫ్ నిరసనలు

▶ వార్తలు లోపలి పేజీల్లో..

పలువురు సిఐల బదిలీ

▶ వార్త 2లో..

ఉక్కు అమ్మకాన్ని సహించం

◆ స్టీల్ బోర్డు డైరెక్టర్లును వెంటనే మార్చండి
◆ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

ప్రజాశక్తి - ఉక్కునగరం : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని సహించబోమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు తేల్చిచెప్పారు. తక్షణమే స్టీల్‌ప్లాంట్ బోర్డు డైరెక్టర్లను మార్చాలని డిమాండ్ చేశారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 652వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఎస్ఎంఎస్ - 2 కార్మికులు కూర్చున్నారు. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కని, దీనిని అమ్మే హక్కు కేంద్రానికి లేదని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కొత్త పరిశ్రమలు పెట్టడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి అంబానీ, అదానీలను ఆహ్వానిస్తే స్వాగతిస్తాంగానీ అమ్మేస్తామంటే సహించేది లేదన్నారు. విశాఖ ఉక్కును కొంటామని పరిశీలనకు ఎవరైనా వస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఊరుకోబోమన్నారు. రెండు రోజులుగా విశాఖ ఉక్కులో బయటి వ్యక్తులు తిరుగుతున్నారని తెలిసి పోరాట కమిటీగా వారిని అడ్డుకుంటున్నామని మిగతా 2లో..

సమిష్టి కృషితోనే హింసను అరికట్టగలం

◆ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి
◆ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విశాఖలో సదస్సు



మాట్లాడుతున్న డాక్టర్ శోభారాణి, వేదికపై ప్రభావతి, తదితరులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టడానికి అందరూ ఐక్యం కావాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ హింసా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం విశాఖలోని మహిళా డిగ్రీ కళాశాలలో 'హింసలేని సమాజం నిర్మిద్దాం - సమానత్వ సాధనకై పయనిద్దాం' అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, శ్రామిక మహిళా సమన్వయ కమిటీల ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ మహిళల పట్ల నానాటికీ హింస పెరుగుతోందన్నారు. దీనిని అరికట్టేందుకు అందరం కలిసి పయనించాలన్నారు. మహిళలు పట్ల హింస పెరగడంలో మద్యం, మత్తు పదార్థాలు ప్రధాన కారణంగా ఉన్నాయని, వీటిని నియంత్రించడంలో ప్రజలు, ప్రభుత్వం కలిసి ముందుకు సాగాలని అన్నారు. అనంతరం ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి, మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

యథాతథమేనా..!

వున్నాయి. ప్రధాన ప్రజా సమస్యలపై సభ్యులు లోతైన చర్చ చేస్తారో, మధ్యాహ్న భోజన సమయానికి తగినట్లు అజెండా అంశాలు నడిపి ముగిస్తారో వేచిచూడాలి.

నేడు 2023-24 అంచనా బడ్జెట్

2023-24 జిల్లా పరిషత్ అంచనా బడ్జెట్ వచ్చే ఏడాది జనవరి 15 నాటికి ప్రభుత్వానికి సమర్పించాల్సివున్నందున 2022-23 సవరణ, 2023-24 అంచనా బడ్జెట్‌ను సమావేశ ఆమోదం కోసం పెట్టనున్నారు. అందుకు ముందుగా ఒకటో స్థాయీ సంఘం ఆమోదం తీసుకొని, తరువాత జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆమోదానికి ఛైర్‌పర్సన్ సుభద్ర పెట్టనున్నారు. 2022-23లో సవరణ బడ్జెట్‌లో జిల్లా పరిషత్ సాధారణ నిధుల ఆదాయం రూ.47.29 కోట్లు, వ్యయం రూ.44.40 కోట్లుగా చూపించారు. 2023-24 అంచనా బడ్జెట్‌లో ఆదాయం రూ.50.77 కోట్లు, వ్యయం రూ.49.90 కోట్లు చూపారు. జిల్లా పరిషత్ సాధారణ నిధులు, ఇంజినీరింగ్ శాఖలు, ఇతర ప్రభుత్వ శాఖల నిధులతో కలిపి 2022-23 సవరించిన బడ్జెట్ ప్రకారం జిల్లా పరిషత్ ఆదాయం రూ.1155.23 కోట్లుకాగా, ఖర్చు రూ.1143.21 కోట్లు, 2023-24 అంచనా బడ్జెట్‌లో ఆదాయం 982.88 కోట్లు, వ్యయం రూ.980.93 కోట్లు చూపారు. ఈ ఏడాది కంటే వచ్చే ఏడాది వివిధ ప్రభుత్వ శాఖల నుంచి వచ్చే ఆదాయం రూ.173 కోట్లు తగ్గుతుందని అంచనా వేశారు.

సమిష్టి కృషితోనే హింసను అరికట్టగలం

రాష్ట్ర సహాయ కార్యదర్శి డాక్టర్ జి.ప్రియాంక మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి పాఠ్య పుస్తకాలలో సమానత్వ స్థాయిని పెంచే అంశాలను పాఠ్యాంశాలుగా పొందుపరచాలన్నారు. నీలి చిత్రాలను నిషేధించాలని, సామాజిక మాధ్యమాల్లో అశ్లీల అంశాలను నిరోధించాలని డిమాండ్ చేశారు. నానాటికీ సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, వాటిని నిరోధించడంలో ప్రభుత్వం పాత్ర పెరగాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన పోటీలో పాల్గొన్న వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మహిళా సాధికారిత సెల్ నిర్వాహకులు నాగలక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షురాలు బి.కుసుమ, డివైఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.విజయ, ఐద్వా నాయకలు వరలక్ష్మి, కుమారి, మణి, ఎస్ఎఫ్ఐ నాయకులు రాఘవ, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఉక్కు అమ్మకాన్ని సహించం

అన్నారు. ముగ్గురు స్టీల్ ఇండిపెండెంట్ డైరెక్టర్లు శుక్రవారం వచ్చి ప్లాంట్ పరిస్థితులను పరిశీలించడాన్ని ఆక్షేపిస్తున్నామని అన్నారు. ప్రస్తుత విశాఖ ఉక్కు బోర్డును రద్దు చేయాలని, గతంలో మాదిరిగా ఆరుగురు డైరెక్టర్లుతోనే వైజాగ్ స్టీల్ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. బోర్డు ఒక రాజకీయ రిహాబ్లేషన్ సెంటర్‌లా తయారైందని, ఎవరు అధికారంలో ఉంటే వారు వారికి నచ్చిన వారిని, అర్హత లేని వారిని బోర్డులో కూర్చోబెడుతున్నారన్నారు. అలాంటి వారి టూర్లు కోసమో లేకుంటే వాళ్ళ అవసరాల కోసమో ప్లాంట్ ఆస్తులను అమ్మాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు.

603వ రోజుకు జెఎసి దీక్షలు

కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పట్ల కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి ఏమాత్రమూ చిత్తశుద్ధి లేదని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్‌హెచ్.హుస్సేన్ అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు శుక్రవారం నాటికి 603వ రోజుకు చేరాయి. దీక్షల్లో పెన్షనర్లు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 12న విశాఖ పర్యటనకు వచ్చిన ప్రధాని మోడీ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై ఎటువంటి ప్రస్తావనా చేయకుండా దాటవేత ధోరణి ప్రదర్శించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మెతక వైఖరి కూడా మోడీ దుర్మార్గపు ఆలోచనకు కారణమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు జె.రాంప్రభు, డి.విజ్ఞానంద్, ఎం.త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పలువురు సిఐల బదిలీ

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : విశాఖపట్నం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఆరుగురు సిఐలను బదిలీ చేస్తూ విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో ఈస్ట్ ట్రాఫిక్‌లో పనిచేస్తున్న బి.తిరుమలరావు రెండో పట్టణ పోలీస్ స్టేషన్ లా అండ్ ఆర్డర్‌కు, రెండో పట్టణ పోలీస్ స్టేషన్ లా అండ్ ఆర్డర్‌లో పనిచేస్తున్న కె.వెంకటరావును సిఎస్‌బి 1కు, సిఎస్‌బి వన్‌లో పనిచేస్తున్న హెచ్.మల్లేశ్వరరావును ఎంవిపి లా అండ్ ఆర్డర్‌కు, ఎంవిపి లా అండ్ ఆర్డర్‌లో పనిచేస్తున్న కెఎన్ఎస్‌వి.ప్రసాద్‌ను ద్వారకా ట్రాఫిక్‌కు, ద్వారకా ట్రాఫిక్‌లో పనిచేస్తున్న సిహెచ్.షణ్ముఖరావును ఈస్ట్ ట్రాఫిక్-2కు, ఈస్ట్ ట్రాఫిక్-2లో పనిచేస్తున్న ఎవి.లీలారావును సిటీ విఆర్‌కు బదిలీ చేశారు.

విపిటిని సందర్శించిన ట్రైనీ ఐపిఎస్‌లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోర్టు ట్రస్టు అథారిటీని మాడ్యూల్ ట్రైనింగ్ ఫేజ్ - 1 శిక్షణ ప్రాథమిక కోర్సులో భాగంగా 24 మంది ట్రైనింగ్ ఐపిఎస్‌లు శుక్రవారం సందర్శించారు. సముద్ర భద్రత అంశం ప్రపంచ ప్రాముఖ్యతను సంతరించుకున్నందున ప్రభుత్వం వీరిని ఓడరేవుల సందర్శన కార్యక్రమానికి పంపించింది. వారికి విశాఖపట్నం పోర్టు ట్రస్టు అథారిటీ ఛైర్మన్ కె.రామమోహనరావు స్వాగతం పలికారు. విశాఖపట్నం ఓడరేవులో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, కార్గో హ్యాండ్లింగ్ సామర్థ్యం, ఆధునికీకరణ, యాంత్రీకరణ, సోలార్ పవర్ సౌకర్యాలు తదితరాలను వివరించారు. అనంతరం పోలీస్ కమిషనర్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కోస్టల్ సెక్యూరిటీ అంశంపై సిపి శ్రీకాంత్ అవగాహన కల్పించారు.

ప్రజల మేలు కోసం బిజెపి, వైసిపి వ్యతిరేక పార్టీల కూటమి అవసరం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్రం మేలు కోసం బిజెపి, వైసిపిలకు వ్యతిరేకంగా మిగతా రాజకీయ పార్టీలు కూటమిగా ఏర్పడాల్సిన అవసరం ఉందని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో పార్టీ విశాఖ జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి రాష్ట్రానికి అన్ని రకాలుగా అన్యాయం చేసిందని అన్నారు. చిలక ప్రాణం మాంత్రికుడి గుప్పెట్లో ఉన్నట్టు జగన్ ఊపిరి మోడీ చేతుల్లో ఉందన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రాన్ని వైసిపి ప్రభుత్వం నిలదీసే పరిస్థితి లేదని చెప్పారు. కేంద్రంలో బిజెపికి వ్యతిరేకంగా విశాల ప్రాతిపదికన లౌకిక, ప్రజాతంత్ర శక్తులు ఒక వేదిక మీదకు రావలసిన అవసరం ఉందని అన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అన్ని స్వతంత్ర సంస్థలను తన చెప్పు చేతల్లో పెట్టుకుని నడిపిస్తోందని విమర్శించారు. ఎన్నికల కమిషనర్‌గా అరుణ్ గోయల్ నియామకం పద్ధతిని సుప్రీంకోర్టు ప్రశ్నించడాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. సిబిఐ చీఫ్‌ని అర్ధరాత్రి మార్చేశారని, ఆ తరువాత నియమించిన సిబిఐ చీఫ్‌ని కూడా చెప్పిన పని చేయలేదని ఫైర్ సర్వీస్‌కు మార్చేసారని అన్నారు. ప్రధాని అనుమతి మేరకే షెడ్యూల్‌ని ప్రకటించే పరిస్థితుల్లో ఎన్నికల సంఘం ఉందని ఆరోపించారు. నోట్ల రద్దు వద్దని చెప్పిన ఆర్‌బిఐ గవర్నర్ రఘురామ రాజన్‌ను మార్చేశారని తెలిపారు. అనుకూలుడైన ఊర్జిత్ పటేల్‌కు ఆ పదవిని కట్టబెట్టారని అన్నారు. నోట్ల రద్దు వల్ల కోట్లాది రూపాయల బ్లాక్ మనీ ఉన్న వారెవరూ ఇబ్బంది పడలేదని, పేదలే నానా అవస్థలకు గురయ్యారని చెప్పారు. అంతర్జాతీయంగా కమ్యూనిస్టులకు సానుకూల పరిణామాలు ఇటీవల కాలంలో చోటుచేసుకున్నాయని చెప్పారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం ప్రాంతీయతత్వాన్ని రెచ్చగొడుతోందని విమర్శించారు. కడప స్టీల్ ప్లాంట్‌కు ఎవరు అడ్డం వచ్చారని, స్టీల్‌ప్లాంట్ ఏర్పడితే రాయలసీమ అభివృద్ధి చెందదా ? అని ప్రశ్నించారు. కేంద్రం మెడలు వంచి, రాష్ట్ర ప్రయోజనాలు సాధిస్తానని చెప్పిన జగన్ ఇప్పుడు ఏం చేస్తున్నారని నిలదీశారు. పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ప్రజా సంఘాలు తమ కార్యక్రమాలను మరింతగా విస్తరించాలని సూచించారు. ఎజె.స్టాలిన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యులు కె.సత్యాంజనేయ, కె.సత్యనారాయణ, ఎ.విమల, ఎస్‌కె.రెహమాన్, పి.చంద్రశేఖర్, ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మానసిక సంతృప్తికి పుస్తకాలు చదవాలి

పుస్తక పఠనానికి వయసుతో సంబంధం లేదని, వృద్ధాప్యం వచ్చినప్పటికీ మానసిక ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం చేయాలని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. టర్నర్ చౌల్ట్రీలో నిర్వహిస్తున్న విశాలాంధ్ర పుస్తక మహోత్సవాన్ని శుక్రవారం సాయంత్రం ఆయన సందర్శించారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి, అరసం రాష్ట్ర కార్యదర్శి ఉప్పల లక్ష్మణరావు, పిఎ.రాజు తదితరులు ఉన్నారు.

అనధికార సంఘాలను నమ్మొద్దు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం 563/73 నెంబరుతో మాతృ సంఘంగా ఆంధ్రప్రదేశ్‌లో ఒక్కటే సంఘం ఉందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చేవూరి రామస్వామి తెలిపారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘానికి 2021 నుంచి అధ్యక్షునిగా తానే కొనసాగుతున్నానని తెలిపారు. అదే నెంబర్‌పై ప్రభుత్వ అధికారిగా పనిచేస్తున్న పావులూరి హనుమంతరావు పదవీకాంక్షతో రాష్ట్ర అధ్యక్షులుగా చెప్పుకుంటూ అనధికారికంగా సంఘాన్ని చిన్నాభిన్నం చేస్తున్నారని ఆరోపించారు. అందులో భాగంగానే ముడసర్లోవలో ఈ నెల 27న విశ్వబ్రాహ్మణులతో పిక్నిక్ ఏర్పాటు చేసి, ఎన్నికలు నిర్వహించేందుకు సన్నద్ధమయ్యారని, దీనిని తాము పూర్తిగా ఖండిస్తున్నామని తెలిపారు. సంఘానికి సంబంధం లేని వ్యక్తులు ఎన్నికలు నిర్వహిస్తే కోర్టుకు వెళతామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం పూర్వపు ఉమ్మడి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగులకొండ ఆశ్లేష ఆచారి, ప్రధాన కార్యదర్శి గోకవరపు శ్రీను, కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్ బోదిలపాటి ఉమామహేశ్వరరావు, విశాఖ జిల్లా అధ్యక్షులు నాగులకొండ సూర్యాచారి పాల్గొన్నారు.

78 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సర్కిల్ 2 సిఐ బి.జగదీశ్వరరావు సూర్యభాగ్ ప్రాంతంలో శుక్రవారం దాడులు నిర్వహించి 78 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా రవాణా చేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన సల్మాన్ ఖాన్, నాజిమ్‌ఖాన్, ఢిల్లీకి చెందిన ఫైజల్ ఖాన్, హిమాచల్ ప్రదేశ్ చెందిన రితిక కుమారిలను అరెస్టు చేశారు. వారి నుంచి గంజాయితో పాటు నాలుగు సెల్‌ఫోన్లు, రూ.5200 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఢిల్లీకి చెందిన రాహుల్‌ను అరెస్టు చేయాల్సి ఉందని సిఐ జగదీశ్వరరావు తెలిపారు. దాడుల్లో ఎస్ఐ ఎల్.మాధవి, రామకృష్ణ చౌదరి పాల్గొన్నారు.

రజకులకు వైసిపి ప్రభుత్వం మొండి చేయి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రజకులకు అనేక విధాలుగా మొండి చేయి చూపారని ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు ఆరోపించారు. శుక్రవారం సాయంత్రం టిడిపి కార్యాలయంలో రాష్ట్ర రజక సాధికారిక కమిటీ సమావేశం జరిగింది. అనంతరం ఏర్పాటైన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రజకులు 16 లక్షల మంది ఉన్నారని, వీరిలో 83 వేల మందికి మాత్రమే వైసిపి ప్రభుత్వం ఏడాదికి రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయం అందిస్తోందని తెలిపారు. ఇది కంటి తుడుపు చర్య మాత్రమేనన్నారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఉన్నప్పుడు రజకులకు ఉచిత విద్యుత్తు అందించారని, రూ.2 లక్షలు వ్యక్తిగత రుణాలు సమకూర్చారని, రూ.15 లక్షలు గ్రూపు లోన్స్ ఇచ్చారని అన్నారు.

సమావేశంలో రాష్ట్ర రజక సాధికారిక కమిటీ కన్వీనర్ గుర్రపుశాల రామకృష్ణ, రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి రాజమండ్రి నారాయణ, రాష్ట్ర రజిక సాధికారిక కమిటీ ప్రధాన కార్యదర్శులు కాకినాడ రామారావు, జిల్లెల శ్రీరాములు పాల్గొన్నారు.

బిసిలకు అన్యాయం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్ర విభజన తర్వాత బిసి కులాలకు అన్యాయం జరిగిందని బిజెపి ఎమ్మెల్సీ పివిఎన్.మాధవ్ అన్నారు. శుక్రవారం ఉదయం బిజెపి నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో బిసిల సమస్యలపై యాత్రలు చేపడతామన్నారు. వైసిపి హయాంలో జరిగిన అన్యాయాన్ని వివరిస్తామని తెలిపారు.

మహారాజశ్రీ రాజాం జూనియర్ సివిల్ జడ్జ్ గారి కోర్టు నందు
O.S.92/2019

Between:
A.V.V. **సత్యనారాయణ** ......Plaintiff
And:
తిరుమలాదాసు కృష్ణ మోహన్ ....Defendant.
To
(ప్రతివాది)
తిరుమలదాసు కృష్ణ మోహన్, తండ్రి నవీన్ చంద్ర, హిందూ, వయస్సు 45 సం॥లు, సాకేన ప్లాట్ నెం.2, 2వ ఫ్లోర్, శ్రీ ఆదిత్య ఎంక్లేవ్, ఆదిత్యనగర్, దేశపాత్రునిపాలెం, విశాఖపట్నం, విశాఖపట్నం జిల్లా.

దావా నోటీసు

పై వాది మీపై దావా బాకీ రాబట్టుట కొరకై పై కోర్టులో దావా వేసినారు. మీకు పలు మార్లు సమన్లు పంపినను అందక తిరిగి వచ్చుచున్నవి. పై కేసు మీ హాజరు కొరకై తేదీ 28-12-2022 నాటికి వాయిదా వేసియున్నారు. కావున మీరు ఆ రోజు ఉదయం గం.10-30 ని.లకు పై కోర్టువారి ఎదుట మీరు గాని లేదా మీ తరపున వకీలు ద్వారా గాని హాజరై మీ యొక్క అభ్యంతరములు తెలియజేసుకొనగలరు. లేనిచో పై కేసు మీకు వ్యతిరేకంగా తీర్పు చేయబడును.

(కోర్టు వారి అనుమతితో)

P.Srinivas,
MA.,HDSE, LLM.,
Advocate & Notary,
Kancharaveedhi, Rajam.
Date: **25-11-2022** **వాది తరపు న్యాయవాది.**

మహారాజశ్రీ యలమంచిలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
O.S.279/2019

Between
శాంతా సత్యవతి ....**వాది**
మరియు
గొర్లి వీర వెంటక సత్య వరప్రసాద్
మరియొకరు ....**ప్రతివాదులు**
టు,
1వ ప్రతివాది: గొర్లి వీర వెంకట సత్యవరప్రసాదరావు S/0 వెంకట రాజు, పాత స్టేట్ బ్యాంకు కొలని, యలమంచిలి, విశాఖపట్నం జిల్లా.
2వ ప్రతివాది : గొర్లి వెంకటలక్ష్మి W/0 గొర్లి వీర వెంకట సత్యవర ప్రసాదరావు, పాత స్టేట్ బ్యాంకు కొలని, యలమంచిలి, విశాఖపట్నం జిల్లా.

పై నెంబరు దావాను వాది ప్రామసరి నోటు బాకీ వసూలు నిమిత్తము దాఖలు చేయగా మీకు నోటిసు నిమిత్తము తేది. 01-12-2022కి వాయిదా అయి వున్నది. కావున సదరు దినమున అనగా **తేది: 01-12-2022న ఉదయం గం॥10.30ని॥** మీరు స్వయముగా కాని, ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టులో హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోవలయును, అట్లు కాని యెడల మీ పరోక్ష మందు పై నెంబరు దావాను పరహరించడమగునని యిందు మూలముగా మీకు తెలియజేయడమైనది

// కోర్టు వారి త్తుర్వులు ప్రకారం //

యలమంచిలి రాజాన గోవిందరావు
తేది:25-11-2022 **అద్వకేటు, యలమంచిలి**
సెల్ నెం.**9848460118**

మహారాజశ్రీ యలమంచిలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
O.S.279/2019 IA1619/2019

Between
శాంతా సత్యవతి ....**వాది/పిటిషనర్**
మరియు
గొర్లి వీర వెంటక సత్య వరప్రసాద్ మరియొకరు
....**ప్రతివాదులు/రెస్పాండెంట్**
టు,
1వ ప్రతివాది/రేస్పాండెంట్ : గొర్లి వీర వెంకట సత్యవరప్రసాదరావు S/0 వెంకట రాజు, పాత స్టేట్ బ్యాంకు కొలని, యలమంచిలి, విశాఖపట్నం జిల్లా.
2వ ప్రతివాది/రేస్పాండెంట్ : గొర్లి వెంకటలక్ష్మి W/0 గొర్లి వీర వెంకట సత్యవర ప్రసాదరావు, పాత స్టేట్ బ్యాంకు కొలని, యలమంచిలి, విశాఖపట్నం జిల్లా.

పై నెంబరు పిటిసిన్‌లో పిటిషనరు ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తి విసయమై ప్రదమ జప్తు కోరుచూ పిటిషనును దాఖలు చేసినందున అందుపై శ్రీ కోర్టు వారు ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తికి సెక్యురిటీ చూపించవలసినదిగా మీకు సోకాజ నోటీసు జారి చేసి తేది. 01-12-2022కి వాయిదా అయి వున్నది. కావున సదరు దినమున అనగా తేది. 01-12-2022న ఉదయము గం. 10.30 ని. మీరు స్వయముగా కాని ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టులో హాజరై మీకు గల ఆక్షేవణలు తెలుపుకోవలయును. అట్ల కాని యెడల మీ పరోక్షమందు ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని ప్రదమ జప్తు చేయడమగునని యిందు మూలముగా మీకు తెలియజేయడమైనది.

షెడ్యూల్

విశాఖపట్నం జిల్లా, అనకాపల్లి జిల్లా రిజిస్ట్రి, యలమంచిలి-రిజి॥ యలమంచిలి మండలం, యలమంచిలి గ్రామం గ॥జి॥మెట్లు సర్వే నెం. 59/1, 14వ వార్డు, 28వ బ్లాకు, మున్సిపాలిటి వార్డు నెంబరు-16, గాంధి నగరం ఏరియా, మున్సిపాలిటి రోడ్డుకు పడమర వైపున 142.222 చ॥గ॥ఖాళి స్థలము మరియు అందులో గలస్లాబు ఇల్లుకు కొలతలు **తూర్పు, పడమరలకు** : 40 అడుగులు (12.192 మీటర్లు) **ఉత్తర, దక్షిణములకు** : 32 అడుగులు (9.753 మీటర్లు) కొలతలు గల దానికి హద్దులు. **తూర్పు** : పొన్నగంటి రత్నం గారి ఖాళి స్థలం.**దక్షిణం** : ప్రహారి గోడ ఆవల షేక్ అబ్దుల్లా గారి ఇల్లు **పడమర** : కొల్లి త్రినాదరావు గారి ఖాళి స్థలం.**ఉత్తరం** : 12 అడుగుల వెడల్పు గల రోడ్డు

// కోర్టు వారి త్తుర్వులు ప్రకారం //

యలమంచిలి రాజాన గోవిందరావు
తేది:25-11-2022 **అద్వకేటు, యలమంచిలి**
సెల్ నెం.**9848460118**

52 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ



ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సునీత

ప్రజాశక్తి - అరిలోవ : జివిఎంసి 13వ వార్డు 7,11 సచివాలయాల పరిధిలో 52మంది లబ్ధిదారులకు రెండో విడతలో జగనన్న ఇళ్లపట్టాలను వార్డు కార్పొరేటర్ కెల్లా సునీత సత్యనారాయణ శుక్రవారం పంపిణ చేశారు. కార్యక్రమంలోవార్డు మహిళా అధ్యక్షురాలు శిరీష, వైసిపి నేతలు దుర్గారావు, వెంకటరెడ్డి, శ్రీను, గోవింద్,బాబూరావు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

అన్నసమారాధన

ప్రజాశక్తి-ఆనందపురం: ఆనందపురం పంచాయతీ పొడుగుపాలెం దొంతలవారి కల్లాలు పీఠం స్వాములకు వైసిపి యూత్ అధ్యక్షుడు చందక అప్పలస్వామి సమకూర్చిన రూ.12వేలు ఆర్థికసాయంతో అన్నసమారాధన నిర్వహించారు. 60మంది అయ్యప్పస్వాములు 40రోజుల భిక్షకు అవసరమైన రూ. 24 వేల బియ్యాన్ని అందించారు.ఆనందపురం-2 ఎంపిటిసి బంటుబిల్లి అప్పలస్వామి రూ.6 వేలు ఆర్థిక సాయంతో టాటా గ్లూకోజ్ ప్యాకెట్లును అందజేశారు. కార్యక్రమంలో క్రోతు సత్యనారాయణ, శినగం రామారావు, చందక శంకరరావు దొంతల శ్రీను, దొంతల బంగార్రాజు, వెంకట నారాయణ, దొంతల అప్పలనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ఆనందపురం: ఆనందపురంలోని జయ సంతోషిమాత ఆలయ 35 వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ ధర్మకర్త జగన్ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో వేములవలస ఉపసర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వరరావు, ముడసల శ్రీను, శ్రీనాథు నారాయణరావు కొట్టాడ రెడ్డిబాబు పాల్గొన్నారు

సిసి డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన



సిసి డ్రెయిన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న కెకె.రాజు

ప్రజాశక్తి- సీతమ్మధార: 43వ వార్డు నందగిరినగర్, శ్రీనివాసనగర్ ఏరియాలో రూ.22.30లక్షల వ్యయంతో సిసి డ్రెయిన్ల నిర్మాణానికి నందగిరినగర్ కష్టుడు గుడి జంక్షన్ వద్ద వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ ఆధ్వర్యంలో ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్ కెకె రాజు శుక్రవారం శంకుస్థాపన చేశారు. గడపగడపకు మన ప్రభుత్వం ప్రజల వినతి మేరకు దీన్ని చేపడుతున్నట్లు రాజు వెల్లడించారు. కార్యక్రమంలో జివిఎంసి ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు ఉన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

సీతమ్మధార : నియోజకవర్గ పరిధిలోని ప్రజల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ఉత్తర నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో సమన్వయకర్త కెకె.రాజు శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలో పలువురు ఇచ్చిన వినతులు, దరఖాస్తులను పరిశీలించి, కొన్నింటిని అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. మిగిలిన వాటిని అతిత్వరలో పరిష్కరిస్తానని భరోసానిచ్చారు. జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస రావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్‌రాజు పాల్గొన్నారు.

నాదెండ్లను కలిసిన భువనేశ్వరి

ప్రజాశక్తి -తగరపువలస

విజయనగరం పర్యటనకు వచ్చిన జనసేన పిఏసి చైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను ఆపార్టీ ఒకటో వార్డు మహిళానేత పరిమి భువనేశ్వరి శుక్రవారం కలిశారు. నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

అన్నదాతల దైన్యం!

బోనిలో తడిసిన 300 ఎకరాల ధాన్యం... అకాల వర్షాలతో నష్టంపై రైతుల ఆవేదన

ప్రజాశక్తి అనందపురం: అల్పపీడన ప్రభావంతో మండలంలోని శుక్రవారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షానికి యంత్రాలతో కోత కోసి ఆరబెట్టిన దాదాపు 300 ఎకరాలకు చెందిన ధాన్యం పూర్తిగా తడిసి ముద్దయిపోయాయి. మండలంలోని 1796 ఎకరాలలో వరి సాగు చేయగా, దాదాపు సగం వరకు కోతలు పూర్తయ్యాయి. బోని గ్రామంలో వరి కోత యంత్రాలతో సుమారు 300 ఎకరాలలో కోసిన ధాన్యాన్ని పొలాల్లోనూ, గ్రామంలోని కమ్యూనిటీ హాల్ వద్ద టార్పాలిన్లు వేసి ఆరబెట్టారు. గడచిన వారం రోజుల్లో కోసిన ధాన్యమంతా ఇలా ఆరుబయటే టార్పలిన్లపై ఆరబెట్టే ఉన్నాయి. శుక్రవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దవ్వడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. శనివారం ఉదయం నుండి తడిసిన ధాన్యంలో చేరి నీటిని బయటకు తోడి ఆరబెట్టే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. గ్రామానికి చెందిన బోని శివశంకర్ రెండు ఎకరాలు, బోనీ అప్పలరాజు మూడెకరాలు, బోని గోవిందకు చెందిన రెండెకరాలు, కనకల దుర్గారావుకు చెందిన ఆరెకరాలు, బోని నరసింహులు, కనకల నర్సింగరావులకు చెందిన చెరో ఎకరంలో ధాన్యం ఇలా తడిసిపోయాయి. పంట చేతికి వచ్చిందన్న సంతోషం లేకుండా వర్షం తెచ్చిన ఇక్కట్లపై రైతులు ఆవేదన చెందుతున్నారు. కాగా ధాన్యం తడిసి, అవస్థలు పడుతున్న రైతులకు, కనీసం ధాన్యం నాణ్యత చెడిపోకుండా వుండేందుకు అవసరమైన సూచనలు ఇచ్చేందుకైనా అధికారులు కానరాకపోవడంతో వారంతా ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం కోసిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు అనేకమంది రైతులు పాత, చిరిగిన టార్పాలిన్లు వాడడం వల్లే నష్టం ఎక్కువగా జరిగిందని, రైతులందరికీ రాయితీపై టార్పాలిన్లు ఇవ్వాలని రైతన్నలు కోరుతున్నారు.



బోనిలో తడిసిన ధాన్యాన్ని చక్కబెడుతున్న రైతులు

పేపర్ బాయ్స్‌కు మంకీ క్యాప్స్, గ్లౌజెస్ వితరణ

ప్రజాశక్తి- గాజువాక : అగనంపూడి అభివృద్ధి కమిటీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ తన ఔదార్యాన్ని చాటుకున్నారు. అగనంపూడి ప్రాంతంలో ఉదయాన్నే చలిలో ఇంటింటికి న్యూస్‌పేపర్స్‌ను అందజేసే పేపర్ బాయ్స్‌కు ఉలెన్ మంకీ క్యాప్స్, హ్యాండ్ గ్లౌజెస్‌ను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా బలిరెడ్డి మాట్లాడుతూ, కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండడంతోపాటు, చదువుకుంటున్న తమకు ఆర్థిక ఆసరా కోసం కొంతమంది విద్యార్థులు ఉదయాన్నే పేపర్‌బాయ్స్‌గా పనిచేస్తున్నారని, అగనంపూడి నుంచి దువ్వాడ వరకు రోజూ రెండు వేల వరకు వివిధ పత్రికలను ఇంటింటికీ వేస్తున్న పేపర్‌బాయ్స్ శ్రమ వెలకట్టలేనిదన్నారు. కార్యక్రమంలో కొండయ్యవలస మరిడిమాంబ ఆలయ అభివద్ది కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ పిల్లా రవి, ఎడిసి డైరెక్టర్ తోకాడ రాము, స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ నాయకులు చట్టి నర్సింగరావు, దువ్వాడ గణేష్, చిన్ని పూర్ణ, న్యూస్‌పేపర్ ఏజెన్సీ ప్రతినిధులు శివాజీ, శేఖర్, హరి పాల్గొన్నారు.



పేపర్ బాయ్స్‌కు మంకీ క్యాప్స్ ఇస్తున్న బలిరెడ్డి

దంత వైద్యులకు 'గీతం'లో వర్క్‌షాప్

ప్రజాశక్తి- మధురవాడ : దంత వైద్యంలో కీలకమైన చికిత్స విధానంగా పేర్కొనే ఎండో డాంటిక్‌పై గీతం దంత వైద్య కళాశాల, ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం దంత వైద్యులకు రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. విశాఖలో త్వరలో జరగనున్న 41వ ఆంధ్ర రాష్ట్ర దంత వైద్యుల సమావేశాలకు ముందస్తుగా ఈ వర్క్‌షాప్‌ను నిర్వహించినట్లు భారత దంత వైద్యుల సంఘం, విశాఖ అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. వర్క్‌షాప్‌లో చెన్నైకి చెందిన ఠాగూర్ దంత వైద్య కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వందన జేమ్స్ రిసోర్స్ పర్సన్‌గా హాజరై ఎండోడాంటిక్స్‌లో నూతన చికిత్స విధానాలపై వివరించారు. కార్యక్రమంలో గీతం దంత కళాశాల ఆసుపత్రి ప్రిన్సిపాల్ డాక్టర్ డిఎస్.రాజు, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ ఎమ్.జ్యోతి, ఎండోడాంటిక్స్ విభాగం అధిపతి డాక్టర్ కె.శిరీష పాల్గొన్నారు.

108 సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి -పిఎం పాలెం: ఉత్తరాంధ్రలో పని చేస్తున్న 108 సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీస్ ఆపరేషనల్ హెడ్ గంగాధర్ భరోసానిచ్చారు. శుక్రవారం పిఎంపాలెం అవంతి కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, 108, 104, 102 నిర్వహణ బాధ్యతలను ప్రస్తుతం అరబిందో సంస్థ తీసుకుందని, ఇందులో పనిచేసే సిబ్బందికి అసౌకర్యం కలగకుండా చూస్తామన్నారు. వచ్చే జనవరిలో సొంత జిల్లాలకు 108 సిబ్బంది బదిలీలు చేస్తామన్నారు.

108 వాహనాల్లో ఐసియులో ఉండే పరికరాలను అమర్చి సేవలను మెరుగుపరిచే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో 104 సేవల డాక్టర్ సునీల్, జనరల్ మేనేజర్ కె.గణేష్, జిల్లా కోఆర్డినేటర్ సురేష్, త్రినాధ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక పిఎస్ఎం, జివిఎంసి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలును జోనల్ కమిషనర్ ఎస్ వెంకటరమణ శుక్రవారం పరిశీలించారు. కొత్తగా మార్చిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం ఎలా అందుతున్న దీ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. ఐఎంఎంఎస్ యాప్‌ను పరిశీలించి, విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. హెచ్ఎం తిరుమల శ్రీదేవి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సత్యరాజు , పిఇటి లక్ష్మీ పాల్గొన్నారు.



విద్యార్థులతో భోజనాలు చేస్తున్న జెడ్‌సి

నేడు జాబ్ మేళా

ప్రజాశక్తి -కంచరపాలెం: విశాఖపట్నంలోని ప్రముఖ సంస్థలైన ఏజిల్ సెక్యూరిటీ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్, అపోలో హాస్పిటల్, కోస్టల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థలో ఉద్యోగాల భర్తీకి ఈనెల 26 శనివారం ఉదయం 10 గంటలకు కంచరపాలెంజిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఉపాధి కల్పనాధికారి (క్లరికల్) సిహెచ్ సుబ్బిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సెక్యూరిటీ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో సెక్యూరిటీ గార్డ్స్ 25 ఖాళీల కొరకు పదవ తరగతి అర్హత కలిగి, 40ఏళ్ల లోపు పురుష అభ్యర్థులు అర్హులన్నారు. .ఎంపికైన వారికి నెలకు రూ.12 వేల నుండి రూ.15 వేలు జీతం ఉంటుందన్నారు. ఎసిస్టెంట్ మేనేజర్స్ ఉద్యోగాలు, రెండు ఖాళీలకు ఏదైనా డిగ్రీ అర్హత కలిగి, 40ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులని, ఎంపికైన వారికి నెలకురూ.20 వేలు జీతం ఉంటుందన్నారు ఎక్స్ సర్వీస్మెన్ సెక్యూరిటీ గార్డ్స్ ఉద్యోగాలు 25 ఖాళీల భర్తీకి ఆర్మీ, నేవీ, పారా మిలటరీలో పనిచేసిన 50ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులని, ఎంపికైన వారికి రోజుకు రూ.1034 జీతం ఉంటుందన్నారు.

అపోలో హాస్పటల్ సంస్థలో సీనియర్ ఎగ్జిక్యూటివ్, ఎగ్జిక్యూటివ్ మార్కెటింగ్ ఉద్యోగాలు 15 ఖాళీల భర్తీకి ఎంబిఎ విద్యార్హతతో మూడేళ్ల అనుభవం కలిగిన 45ఏళ్ల లోపు పురుష అభ్యర్థులు అర్హులని, అనుభవం బట్టి జీతం ఉంటుందన్నారు. అలాగే కోస్టల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థలో ఇండస్ట్రియల్ మెకానికల్ మెయింటెనెన్స్, ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్ ఆపరేటర్ ఉద్యోగాలకు 85 ఖాళీల భర్తీకి డిప్లమో, ఐటిఐ అర్హత కలిగిన 23-30ఏళ్లలోపు పురుష అభ్యర్థులు అర్హులని, నెలకు రూ.12వేలు నుంచి రూ.20వేలు జీతం ఉంటుందన్నారు. సువర్ణభూమి(గాజువాక) సంస్థలో మేనేజర్స్ ఉద్యోగాలు 10 ఖాళీలకు డిగ్రీ, బీటెక్, ఎంబిఎ అర్హత కలిగి 36 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.17వేలు జీతం ఉంటుందన్నారు టెలికాలర్స్ ఉద్యోగాలు 10 ఖాళీలకు పదవ తరగతి, ఇంటర్ అర్హతగల అభ్యర్థులకు నెలకు రూ.9వేలు జీతం ఇస్తారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ముందుగా తమ వివరాలను ncs.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొని జాబ్‌మేళాకు హాజరు కావాలని సూచించారు.

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ

ప్రజాశక్తి- మధురవాడ : రుషికొండలోని మహాలక్ష్మి గోదాదేవి సహిత వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారికి శుక్రవారం అభిషేకం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో టిటిడి అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

పదో వార్డులో గడపగడపకూ..

ప్రజాశక్తి - అరిలోవ : జివిఎంసి పదో వార్డు ఎస్ఐజి నగర్, రామాలయ ప్రాంతంలో వార్డు వైసిపి ఇన్‌ఛార్జి జగ్గుపిల్ల జయ అప్పలరాజు ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం తూర్పు సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీయడంతోపాటు ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎడ్యుకేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పతివాడ వెంకటలక్ష్మి కనకరాజు, వైదా నారాయణరావు, ఒమ్మి శ్రీను, మన్యల రమణ, రజిని, మొల్లి వెంకటరమణ, చలం, తులసి కనకమ్మ, గోవింద్ పాల్గొన్నారు.

నృసింహ దీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి -సింహాచలం: ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం ఘనంగా నృసింహదీక్షలు ప్రారంభమయ్యాయి. స్థానాచార్యులు గోపాల్, అర్చకులు కర్రి సీతారామాచార్యులు దీక్షకు కావలసిన మాలలను, వస్త్రాలను స్వామి చెంత నుంచి ప్రత్యేక పూజలు అనంతరం, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపం వద్ద మాలధారణ చేయించారు. కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డ్ సభ్యులు గంట్ల శ్రీనుబాబు సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అభ్యసనాభివృద్ధిపై శిక్షణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక జివిఎంసి పిఎస్ఎం ఉన్నత పాఠశాలలో 6,7,8 తరగతులు బోధించే తెలుగు ఉపాధ్యాయులకు లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాంపై ప్రభుత్వ డైట్ వైస్ ప్రిన్సిపల్ సుధాకర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, బోధనలో తర్ఫీదు పొందడం ద్వారా విద్యార్థులకు కరకులం అందించవచ్చని సూచించారు. కోవిడ్ తదనంతరం విద్యార్థుల అభ్యసనల్లో వచ్చే మార్పులకు అనుగుణంగా అభ్యసన ఉండాలన్నారు. పాఠశాల హెచ్ఎం తిరుమల శ్రీదేవి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు శాస్త్రి పాల్గొన్నారు.

కార్మికుల సంఖ్య పెంపు అత్యవసరం



మాట్లాడుతున్న సిఐటియు నేత వైటి దాస్

ప్రజాశక్తి-ఉక్కునగరం :విశాఖ ఉక్కు కర్మాగారంలోని రోల్ అండ్ రిపేర్ షాప్ విభాగంలో కార్మికుల సంఖ్య పెంచాలని స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి వైటి దాస్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఉక్కునగరంలోని స్టీల్ సిఐటియు కార్యాలయంలో విభాగపు 14వ సిఐటియు మహాసభ నిర్వహించారు. ఈసందర్భంగా వైటి దాస్ మాట్లాడుతూ నాణ్యమైన ఉత్పత్తులు సాధించాలంటే కొత్త కార్మికులకు నైపుణ్యతను ప్రస్తుతమున్న కార్మికులు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విభాగం పట్ల యాజమాన్యం వైఖరిని తక్షణం మార్చుకోవాలని డిమాండ్ చేశారు. స్టీల్ సిఐటియు ఉపాధ్యక్షులు యు.రామస్వామి మాట్లాడుతూ కార్మికుల మనోభావాలను గుర్తించకుండా, స్టీల్ ఉత్పత్తిని యాజమాన్యం గణనీయంగా తగ్గించడం దారుణమన్నారు. విభాగం కార్యదర్శి కె బాలశౌరి మాట్లాడుతూ సిఐటియు ఇస్తున్న పిలుపులో భాగస్వామ్యం అవుతున్న విభాగం కార్యకర్తలను అభినందించారు. ఈ స్ఫూర్తిని కొనసాగించాలని అభ్యర్థించారు.

నూతన కార్యవర్గం

విభాగం నూతన అధ్యక్షులుగా యు శ్రీనివాస్, నూతన కార్యదర్శిగా కె బాలశౌరి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వివిజిఎస్ డి ప్రసాద్, ఉపాధ్యక్షులుగా యు వెంకటేశ్వర్లు, బిఎన్ మధుసూదన్, ఎం.ప్రసాద్, అడిషనల్ సెక్రటరీగా కెవి సూర్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కెపి సుబ్రహ్మణ్యం, జాయింట్ సెక్రెటరీగా కెవి ప్రసాద్, అసిస్టెంట్ సెక్రటరీగా కెవిఆర్ మూర్తి, ఎస్‌వి.శర్మ, మరొక 13 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యత



జూనియర్ కాలేజీ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ప్రజాశక్తి-పద్మనాభం: నిరుపేదలకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలోని కృష్ణాపురంలో కస్తూర్బా పాఠశాలలో జూనియర్ కాలేజీ విభాగాన్ని ప్రారంభించారు. రూ.1.10కోట్లతో నిర్మించిన పది తరగతి గదులను ప్రారంభించి, విద్యార్థులకు అందించారు. ఆటల పోటీల్లో ప్రతిభ చూపిన వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఖరీఫ్‌లో పండిన ధాన్యాన్ని ప్రభుత్వపరంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి లబ్ధి పొందాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులకు మెరుగైన సేవలను అందించేందుకు ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిందని, ఏ సమస్య వచ్చినా అక్కడ సంప్రదించాలని సూచించారు. ఈసందర్భంగా కొందరు రైతులు గతేడాది ధాన్యం కొనుగోలులో చోటుచేసుకున్న లోపాలను వివరించి, పునరావృతం కాకుండా చూడాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టిని కోరారు.

27న విశ్వబ్రాహ్మణుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి- సీతమ్మధార: ఈనెల 27న ముడసర్లోవ పార్కులో విశ్వబ్రాహ్మణుల కార్తీక సమారాధన, ఆత్మీయ కలయికకు పెద్దఎత్తున తరలిరావాలని ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ ఫెడరేషన్ మాజీ డైరెక్టర్, బిసి సాధికారత కమిటీ కన్వీనర్ గోడి నరసింహచారి కోరారు. శుక్రవారం పౌర గ్రంథాలయంలో మీడియాతో మాట్లాడుతూ కార్యక్రమంలో సంఘం బలోపేతానికి నూతన కమిటీ ఎన్నిక జరుగుతుందన్నారు. సమావేశంలో పిక్నిక్ చైర్మన్ శివకోటి శ్రీనివాసరావు, నగర స్వర్ణకార సంఘం అధ్యక్షులు ముదపాక రవి, సమన్వయకర్త కానూరు లక్ష్మణరావు పాల్గొన్నారు.

మాట నిలుపుకున్న వంశీరెడ్డి



తండ్రి లేని పిల్లలను పాఠశాలలో చేర్పిస్తున్న వంశీరెడ్డి

ప్రజాశక్తి- గాజువాక : ఇంటి పెద్దదిక్కు మృతితో అనాథలైన పిల్లల చదువుకు అండగా ఉంటానని భరోసానిచ్చిన 74వ వార్డు కార్పొరేటర్, వైసిపి సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ తిప్పల వంశీరెడ్డి తన మాటను నిలబెట్టుకున్నారు. ఐదు నెలల క్రితం వార్డు పరిధిలోని గోరుసు రాజేష్‌కుమార్ మరణంతో దిక్కులేకుండా పోయిన వారి కుటుంబాన్ని అప్పట్లో పరామర్శకు వచ్చిన వంశీరెడ్డి, పిల్లలను పదో తరగతి వరకు తాను చదివిస్తానన్న మాటకు కట్టుబడి, శుక్రవారం రాజేష్‌కుమార్ ఇద్దరు పిల్లలను ఒకరిని ఎల్‌కెజిలోనూ, మరొకరిని ఒకటో తరగతిలోనూ స్థానిక టిఎస్ఆర్ టాలెంట్ స్కూల్‌లో దగ్గరుండి చేర్పించారు. వారికి పదోతరగతి వరకు చదువుకు అయ్యే మొత్తం ఖర్చును తాను భరిస్తానని మరోమారు స్పష్టం చేశారు. ఇచ్చిన మాటను నిలుపుకున్న వంశీరెడ్డినిపిల్ల తల్లి జ్యోతితోపాటు వారి కుటుంబీకులు ధన్యవాదాలు తెలిపారు.

కాగా రాజేష్‌కుమార్ కుటుంబానికి ఇదివరకే డ్వాక్రా సంఘ సభ్యులు సామాజిక బాధ్యతగా సమకూర్చిన రూ.23వేలు నగదు సాయాన్ని అప్పట్లో వంశీరెడ్డి అందజేసిన విషయం తెలిసిందే. కార్యక్రమంలో వైసిపి నేతలు గోరుసు సత్యం, గొందేశి సత్తిరెడ్డి, పూతి తాతారావు, గొరుసు రామలక్ష్మి, వార్డు సిఒ సూర్యనారాయణ, ఆర్‌పిలు హైమావతి, సుధ, సత్య, వరలక్ష్మి, గురమ్మ, గొందేశి అప్పలరెడ్డి, సత్తిరెడ్డి, తులసి, భులాక, కోటి, బాలు పాల్గొన్నారు.

ఇఎస్ఐలో వైద్యసేవలు మెరుగుపరచకుంటే

ఆందోళన తీవ్రతరం చేస్తాం



వర్షంలోనూ ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఇఎస్ఐలో మెరుగైన వైద్యసేవలు అందించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్, సిఐటియు గౌరవాధ్యక్షులు ఒ.ఎల్. రావు ఉక్కు యాజమాన్యాన్ని., రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. యూనియన్ ఆధ్వర్యంలో ఉక్కు బిసి.గేటు వద్ద శనివారం ఉదయం నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఇఎస్ఐలోవైద్యం నానాటికీ దయనీయంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

విశాఖలో రిఫరల్ ఆసుపత్రులకు అనుమతులు ఇవ్వకుండా, నాణ్యమైన, సరైన మందులు సమకూర్చకుండా కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయని మండిపడ్డారు.ఇదే పరిస్థితి కొనసాగితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు. జి శ్రీనివాసరావు, నమ్మి రమణ, నాయకులు చట్టి నర్సింగరావు, యు సోమేష్, వి వరహాలు, పి మసేను, ఎ శ్రీను, బి ఆనంద్, బండి అప్పలరాజు, నమ్మి చంద్రరావు, విఆర్ఎల్ స్వామి పాల్గొన్నారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా కార్మికులు ఆందోళన చేపట్టారు.

అధిక బరువుకు ఆహారపు అలవాట్లే కారణం

కిమ్స్ ఐకాన్ మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, లివర్ స్పెషలిస్ట్, ఇంటర్వేషనల్ ఎండోస్కోపిస్ట్ డాక్టర్ చలపతిరావు ఆచంట,



డాక్టర్ చలపతిరావు ఆచంట

ప్రజాశక్తి- గాజువాక : దేశ ప్రజలను పట్టిపీడిస్తున్న అనారోగ్య సమస్యల్లో ప్రధానమైన ఊబకాయానికి మనుష్యుల జీవనశైలి, ఆహారపు అలవాట్లే ముఖ్యకారణమని కిమ్స్ ఐకాన్ ఆసుపత్రి కన్సల్టెంట్ మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, లివర్ స్పెషలిస్ట్, ఇంటర్వేషనల్ ఎండోస్కోపిస్ట్ డాక్టర్ చలపతిరావు ఆచంట అన్నారు. నవంబర్ 26, జాతీయ ఊబకాయ నివారణ దినోత్సవం సందర్భంగా దీనిపై ప్రజల్లో అవగాహనకు కొన్ని సూచనలు చేశారు.

చిన్నపిల్లల్లో ఊబకాయుల్లో ప్రపంచంలోనే రెండోస్థానంలో ఉన్న భారత్, అధిక బరువు సమస్యకు ఆహారపు అలవాట్లే ప్రధాన కారణమని నివేదికలు వెల్లడిస్తున్నాయన్నారు. తిన్న తిండికి, చేసే పనికి సమతుల్యత లేకపోవడం, పిల్లలు ఆటలకు దూరంగా ఉండడం, శారీరక శ్రమ లేకపోవడం ప్రధాన కారణాలు కాగా, కొందరిలో జన్యుపరమైన కారకాలు, ఎండోక్రైన్ రుగ్మతలు, కొన్ని ఔషధాల పర్యవసానంగా అధిక బరువు పెరిగే అవకాశం ఉందన్నారు. తాజా జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం, పిల్లలలో ఊబకాయుల రేటు పదిరెట్లు పెరగడం, 2030నాటికి ప్రతి పదిమంది భారతీయ చిన్నారుల్లో ఒకరు ఊబకాయులుగా ఉంటారన్న అంచనాలు ఆందోళన కలిగించే అంశాలన్నారు.

ఉదయం అల్పాహారం మానేయడం, తీపి పానీయాలు తాగడం, జంక్‌ఫుడ్స్, క్యాలరీలు ఎక్కువగా ఉండే ఆహారం తినడం, టీవీల ముందు కూర్చుని తినడం వంటివి ఊబకాయం పెరగడానికి ప్రధాన కారణాలు. ఊబకాయంతో బాధపడే చిన్నారుల్లో టైప్ 2 డయాబెటిస్, హైపర్ టెన్షన్, కొలెస్ట్రాల్, శ్వాసకోశ రుగ్మతలు, ఆస్తమాతోపాటు ఫ్యాటీ లివర్, ఎముకల సమస్యలు కూడా వచ్చే అవకాశముందన్నారు.. ఊబకాయం నియంత్రణకు సమతుల పోషకాహారం తీసుకోవడం, వ్యాయామం చేయడం, ఆటలాడడం వంటివి చేయాలి, తక్కువగా టీవీలు చూడడంతోపాటుటీవీల ముందు కూర్చొని ఆహారం తినడం మానేయాలని డాక్టర్ చలపతిరావు సూచించారు.

అద్దె బస్సులతో ఆర్‌టిసికి నష్టం: ఎస్‌డబ్ల్యుఎఫ్



ఆర్‌టిసి డిపో వద్ద ఆందోళన చేస్తున్న ఎస్‌డబ్ల్యుఎఫ్ కార్మికులు

ప్రజాశక్తి- సింహాచలం : అద్దె బస్సులతో ఆర్‌టిసికి నష్టం వాటిల్లుతోందని, సంస్థ ద్వారా సొంత బస్సులు కొనుగోలు చేసి నడపాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) సింహాచలం డిపో అధ్యక్ష కార్యదర్శులు కెకెఎఫ్.రావు, ఇవిఎస్.రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సింహాచలం డిపో వద్ద కార్మికుల సమావేశం నిర్వహించారు. 2017 వేతన బకాయి చెల్లించాలని, నగదు అలలెన్సు ఎప్పటికప్పుడు ఇవ్వాలని కోరారు.

అక్రమ నిర్మాణాలపై తక్షణ చర్యలు

జివిఎంసి సిటీ ప్లానర్ సురేష్‌కుమార్

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి -సీతమ్మధార : జివిఎంసి పరిధిలోని వివిధ వార్డుల్లో యథేచ్ఛగా సాగుతున్న అక్రమ నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జివిఎంసి చీఫ్ సిటీ ప్లానర్ సురేష్‌కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం ప్రజాశక్తి దినపత్రికలో 'అక్రమ నిర్మాణాలకు ఆకాశమే హద్దు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందిస్తూ, కథనంలో లేవనెత్తిన అక్రమ నిర్మాణాలపై పరిశీలన జరిపి, రెండు మూడురోజుల్లో చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'పంచకర్ల'కు శుభాకాంక్షల వెల్లువ



రమేష్‌బాబును అభినందిస్తున్న రాజశేఖర్, తదితరులు

ప్రజాశక్తి- గాజువాక : వైసిపి జిల్లా అధ్యక్షునిగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబును వైసిపి రాష్ట్ర నేత మంత్రి రాజశేఖర్, 76వ వార్డు సీనియర్ నేత మంత్రి శంకర్‌నారాయణ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. పార్టీలో కష్టబడి పనిచేసే వారికి ఎపుడూ గుర్తింపు, ఉన్నతస్థితి ఉంటుందని వారు అన్నారు. పంచకర్లను కలిసిన వారిలో రంభ నారాయణమూర్తి, కామేష్, బలగా రామారావు, తలారి నాగేశ్వరరావు, యండా కష్ణ, పెంటారావు, చిరంజీవి, అచ్యుత్, రేవతి, దేవి ఉన్నారు

పెందుర్తి : వైసిపి జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును, ఆ పార్టీ సీనియర్ నేత పెందుర్తి గ్రంథాలయ అభివద్ధి కమిటీ చైర్మన్ వేగి శ్రీనివాసరావు శుక్రవారం. నగరంలోని పంచకర్ల నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి, దుశ్శాలువాతో సత్కరించారు. బుట్టా రవికుమార్, శరగడం అప్పారావు, మురళి, కె.వెంకటరావు, బి. సూరి అప్పారావు, ప్రకాశరావు, బి.మదన్, బి. రాజా విశ్వేశ్వరరావు ఉన్నారు.

సీతమ్మధార : వైసిపి జిల్లా అధ్యక్షుడు పంచకర్లను అతని నివాసంలో ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, మాజీ మంత్రి బాలరాజు, బిసి కమిషన్ సభ్యులు పక్కి.దివాకర్, పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి రవిరెడ్డి, సతీష్ వర్మ, స్టీల్‌ప్లాంట్ యూనియన్ నాయకులు మంత్రి రాజశేఖర్, పార్టీ ఎస్‌సి విభాగం రాష్ట్ర నేత ప్రేమ్‌బాబు, నాయకులు రెయ్యి వెంకటరమణ, ద్రోణంరాజు శ్రీవాత్సవ, వుడా రవి, దాడి సత్యనారాయణ, యువశ్రీ, రోజారాణి కలిసి అభినందించారు.

ములగాడ :వైసిపి జిల్లా అధ్యక్షుడు పంచకర్లను వైసిపి రాష్ట్ర అదనపు కార్యదర్శి, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ కలిసి అభినందించారు. రమేష్‌బాబు నేతృత్వంలో పార్టీ బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

శ్రీధర్‌రెడ్డికి అభినందన



శ్రీధర్‌రెడ్డిని అభినందిస్తున్న కెకె.రాజు తదితరులు

ప్రజాశక్తి- సీతమ్మధార :స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్, జాబ్ ఫెయిర్స్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన మిలీనియం శ్రీధర్‌రెడ్డిని శుక్రవారం వైసిపి ఉత్తర నియోజకవర్గ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్ కెకె.రాజు పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు.కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్‌రాజు, మాజీ కార్పొరేటర్ పోతు సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా, విభజన హామీలపై పోరాటం

- రాష్ట్రంలో అధికార, విపక్ష పార్టీలు ఎవరి పక్షాన ఉన్నాయో తేల్చి చెప్పాలి
- రౌండు టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్రానికి రావాల్సిన ప్రత్యేక హోదా, విభజన హామీలు, విశాఖ రైల్వే జోన్ విషయంలో మోసగించిన బిజెపి ప్రభుత్వంపై పోరాడాలని అఖిలపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక నిలయంలో శుక్రవారం ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం సిపిఎం నాయకులు ఎ.బాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ 8 ఏళ్ల పాటు అధికారంలో ఉన్న బిజెపి ఇంతవరకు రాష్ట్రానికి న్యాయం చేయకపోగా, మరోసారి అధికారం ఇస్తే న్యాయం చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. దేశంలో అనేక రాష్ట్రాలకు ప్రత్యేక హోదా అమలు జరుగుతుందన్నారు. పదేళ్లు ప్రత్యేక హోదా కల్పిస్తామని చెప్పిన నాయకులు నేడు కనీసం మాట్లాడకపోవడం దుర్మార్గమన్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ వెనుకబడ్డ ప్రాంతాలకు ఇస్తామన్న నిధులు కూడా విడుదల చేయలేదన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీల విషయంలో రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు కేంద్రంపై పోరాడకుండా విద్వేషాలు రెచ్చగొడుతున్నాయని విమర్శించారు. బిజెపి అడుగులకు మడుగులొత్తుతున్న ఈ పార్టీలు ప్రజా కోర్టులో దోషులుగా నిలబడక తప్పదన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని అమ్మేస్తామని నిస్సిగ్గుగా బిజెపి చెబుతుంటే, ఆ పార్టీని వెనకేసుకురావడం దారుణమన్నారు. ఈ సమావేశంలో ఎన్వి భద్రం, మల్ల మాధవరావు (ఏఐటియుసి), ఆర్.శంకర్రావు, ఈశ్వరరావు, చలపతి (సిఐటియు) గంట శ్రీరామ్ (గొర్రెలు మేకలు పెంపకం దారుల సంఘం), పి.శ్రీనివాసరావు (పౌర సంక్షేమ సంఘం), తెలయ్య బాబు (కౌలు రైతు సంఘం), బుగిడి నూక అప్పారావు (వికలాంగుల హక్కుల జాతీయ వేదిక), తాకాసి వెంకటేశ్వరరావు (మాజీ కౌన్సిలర్) మాట్లాడారు.



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు బాలకృష్ణ, చిత్రంలో వివిధ సంఘాలు, పార్టీల నేతలు


ఆందోళన చేస్తున్న నేవీ నిర్వాసితులు

26వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి - రాంబిల్లి

నేవల్ బేస్ నిర్వాసితులు ఎనిమిది గ్రామాల ప్రజలు చేస్తున్న ఆందోళన శుక్రవారం నాటికి 26వ రోజుకు చేరింది. నిర్వాసితులు నేవీ మెయిన్ గేటు ముందు బైఠాయించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నేవీబేస్ వల్ల సర్వం కోల్పోయిన తమని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని, జీవన భృతి కల్పించాలని, పెండింగ్ ప్యాకేజీలు అందజేయాలని డిమాండ్ చేశారు. మత్స్యకారులకు చేపలు వేటకు అనుకూలంగా జెట్టీ నిర్మించాలని, నిర్మాణ పనుల్లో స్థానికులకు ఉపాధి కల్పించాలని, ఆధార్ కార్డు ఆధారంగానే శారద వరాహ, నదుల్లో చేపలు వేటకు పంపాలని, వ్యవసాయ భూములకు రోడ్డు సౌకర్యం కల్పించాలని, శ్మశాన స్థలాలు కేటాయించాలని, ప్రభావిత గ్రామాలను నిర్వాసిత గ్రామాలుగా గుర్తించి ప్యాకేజీలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో 8 గ్రామాల నిర్వాసితులు పాల్గొన్నారు.

నేడు సుంకర సూరిబాబు సంస్మరణ కార్యక్రమం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట



ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన బుచ్చయ్యపేట సర్పంచ్ సుంకర సూరిబాబు సంస్మరణ కార్యక్రమం శనివారం జరగనుంది. మంచికి మారుపేరుగా, సహకారానికి చిరునామాగా, కష్టం ఉందంటే నేనున్నానంటూ ముందుకు వచ్చి గ్రామస్తులకు సహకారాలు అందించిన సూరిబాబు సంస్మరణ కార్యక్రమానికి గ్రామస్తులు, అభిమానులు ఏర్పాటు చేశారు. యువకుడిగా ఉన్నప్పుడు కమ్యూనిస్టు భావాలంతో ప్రజలకు సహాయ సహకారాలు అందించడానికి ముందుండేవారని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో ఎవరికి ఎటువంటి ఆపద వచ్చినా, ఎటువంటి అనారోగ్యం వచ్చిన ముందుగా గుర్తొచ్చేది సూరిబాబు. అలాంటి వ్యక్తి ప్రమాదంలో మృతి చెందటం గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు. విశాఖ డెయిరీ పాల సంఘం అధ్యక్షునిగా ఉంటూ టిడిపిలో కీలకంగా వ్యవహరించేవారు. 2013 స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీ చేసి నాలుగు ఓట్ల తేడాతో ఓటమి చెందిన ఆయన 2021లో జరిగిన ఎన్నికల్లో అధికార పార్టీ హవాలో సైతం సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్న తరుణంలో మృతి చెందడం గ్రామానికి లోటని గ్రామస్తులు వాపోతున్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- సబ్బవరం : స్థానిక జాగృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. జాగృతి స్వచ్ఛంద సంస్థ ఎమ్‌డి కందర్ప సుజాత పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమాన్ని జాగతి మార్క్ అధ్యక్షులు కోటిని అమ్మతల్లి నాయుడు ప్రారంభించారు. డాక్టర్ అనిల్ కుమార్ 186 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 15 మందికి కెటరాక్ట్ ఆపరేషన్లు అవసరమని నిర్ధారించారు. 128 మందికి కంటి అద్దాలు పెట్టుకోవాలని సూచించారు. 43 మందికి కంటి చుక్కల మందు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాగృతి సిఈఓ కెవిఎన్ మౌక్తిక మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో వచ్చే నెలలో నేత్ర వైద్య శిబిరంతో పాటు స్త్రీల వ్యాధులకు సంబంధించిన గైనిక్ డాక్టర్లచే వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బోకం విజయ, జి.ప్రసాద్, పి.రమేష్, ఎస్.ప్రవీణ్, ఎం.వెంకటేశ్వర్లు, ఈ.వరలక్ష్మి, కె.అరుణ, వివి. సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



కంటి వైద్య శిబిరంలో పాల్గొన్న జాగృతి ప్రతినిధులు

మహిళలపై అత్యాచారాలను అరికట్టాలి

ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన ర్యాలీ, మానవహారం


మానవహారం చేస్తున్న విద్యార్థినులు

ప్రజాశక్తి-అనకాపల్లి

మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలని, ఇందు కోసం పకడ్బందీగా చట్టాలను అమలు పరచాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. ప్రపంచ హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన శుక్రవారం కళాశాల విద్యార్థినులు ర్యాలీ నిర్వహించి, స్థానిక నెహ్రూ చౌక్ జంక్షన్‌లో మానవహారం చేశారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు నిరసనగా కార్య క్రమాలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు సుభాషిణి మాట్లాడుతూ మహిళలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో పురుషులతో సమానంగా అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళలు నేడు అన్ని విధాలుగా అణగదొక్కబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు గొర్లి తరుణ్, మౌనిక, పావని, అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

వరికి వరుణుడి దెబ్బ

వర్షానికి తడిసిపోయిన పంట



వర్షానికి తడిసిన వరి చేను

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

వరి పంట చేతికొచ్చే సమయంలో వరుణుడు తీవ్ర నష్టాన్ని తెచ్చిపెట్టాడు. మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం ఉదయం నుండి చిరుజల్లులు కురవడంతో పొలాల్లో కోతలు కోసి ఆరబెట్టిన వరి పంట తడిసిపోయింది. ఒకవైపు వరి పంట కోతలకు సిద్ధంగా ఉండడంతో పంట చేతికి వచ్చే సమయంలోనే వర్షాలు కురుస్తుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో వందలాది ఎకరాల్లో వరి పంట కోతలకు సిద్ధంగా ఉంది. నీలకంఠాపురం, రాజాం, పెద్దమదిన గున్నెంపూడి ,కొండపాలెం, బుచ్చయ్యపేట తదితర గ్రామాల్లో గత రెండు రోజులుగా కొంతమంది రైతులు వరి పంటను కోసి మడులలోనే విడిచిపెట్టారు. కోసిన వరి పంటను రెండు మూడు రోజులపాటు పొలాల్లో ఎండబెట్టి కుప్పలుగా పెడతారు. అయితే శుక్రవారం ఉదయం కురిసిన వర్షానికి పెద్దమదిన, గునెంపూడి నీలకంఠాపురం తదితర గ్రామాల్లో కోసి పొలాల్లో విడిచిపెట్టిన వరి పంట తడిచిపోయింది. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పంట చేతికి వచ్చే సమయాల్లోనే వర్షాలు కురుస్తుండడం వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు.

చిననందిపల్లిలో 'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని చిననందిపల్లి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు శుక్రవారం నిర్వహించారు. గ్రామంలోని యాతపేటలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను గ్రామ సర్పంచ్ పోతల చెల్లయ్యమ్మ రఘు వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. అనంతరం గ్రామంలో పర్యటించి, ప్రజా సమస్యలు తెలుసుకుంటూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ముందుగా అంగన్వాడీ కేంద్రంలో కాసేపు చిన్నారులతో ఆటపాట కార్యక్రమం నిర్వహించి వారికి చాక్లెట్లు, బిస్కెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు కర్రి సత్యం, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, సర్పంచులు, ఎంపిటిసిలు, పార్టీ శ్రేణులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి అద్దె బస్సు కార్మికుల సమస్యలపై నిరసన

ప్రజాశక్తి -అనకాపల్లి

ఆర్టీసీ అద్దె బస్సు కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపో ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డిపో అధ్యక్షులు బి.అప్పారావు, కార్యదర్శి పివిస్ పరమేశ్వర రావు, కోశాధికారి కే నాగేశ్వరరావు, ప్రచార కార్యదర్శి ఎస్ఆర్‌టి మూర్తి మాట్లాడుతూ ఆర్టీసీ యాజమాన్యం 2017 నుంచి 2019 వరకు, 2020- 21, 2021 -22 సంవత్సరానికి చెల్లించాల్సిన లీవ్ ఎన్కాష్మెంట్ తక్షణమే చెల్లించాలని, అద్దె బస్సుల పేరుతో ప్రైవేటీకరణకు యాజమాన్యం చేపడుతున్న చర్యలు ఆపాలని డిమాండ్ చేశారు. 2022 సంవత్సరానికి గాను లీవ్ ఎన్కాష్మెంట్ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలన్నారు. ఆర్టీసీ సంస్థ ప్రభుత్వంలో విలీనమైన అద్దె బస్సులు కొనసాగుతున్నాయన్నారు. ప్రభుత్వ బడ్జెట్లో ఆర్టీసీకి 408 కోట్లు కేటాయించిన నేపథ్యంలో ఆ సొమ్ముతో సొంత బస్సులు కొనే అవకాశం ఉందన్నారు. ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనమైన తర్వాత చేపడుతున్న చర్యలు ప్రైవేటీకరణ చేసే దిశగా అడుగులు పడుతున్నాయన్నారు.



నిరసన తెలుపుతున్న ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు



నిత్యావసరాలు అందజేస్తున్న గంటా యువసేన నాయకులు

ప్రేమ సమాజానికి నిత్యావసర సరుకులు

ప్రజాశక్తి- కశింకోట

మాజీ మంత్రి, విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జన్మదిన వార్షికోత్సవాలు సందర్భంగా గంటా యువసేన ఆధ్వర్యంలో శుక్రవారం కొక్కొరపల్లి ప్రేమ సమాజానికి నెల రోజులకు సరిపడిన నిత్యవసర సరుకులను తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉగ్గిన రమణమూర్తి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కలగా సోమేశ్వరరావు, సిద్దిరెడ్డి సూర్యనారాయణ, ఉల్లింగల రమేష్, గంటా యువసేన ప్రతినిధులు జెర్రిపోతుల నూకునాయుడు, గొంతిన గంగాధర్, గుమ్మాల మాణిక్యం, బుదిరెడ్డి రామారావు, సింహాద్రి దేవా, రాజు, అప్పారావు పాల్గొన్నారు.

18 ఏళ్లు నిండిన వారు ఓటు నమోదు చేసుకోవాలి : ఆర్‌డిఓ

ప్రజాశక్తి -అనకాపల్లి

18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు చేసుకోవాలని ఆర్డీవో చిన్నికృష్ణ అన్నారు. స్థానిక ఏఎంఎఎల్ కళాశాలలో శుక్రవారం ఓటర్ నమోదు కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన నాయకుడిని ఎన్నుకోవడంలో యువత ప్రముఖ పాత్ర వహించాలన్నారు. వచ్చేనెల 8 వరకు ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమం జరుగుతుందన్నారు. డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో ఓటర్ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పోలింగ్ కేంద్రాల్లోనే కాకుండా ఆన్లైన్లో కూడా ఓటు నమోదు చేసుకోవచ్చని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జయ బాబు మాట్లాడుతూ ఓటు అనే ఆయుధం ద్వారా దేశ భవిష్యత్తును కాపాడాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీరామమూర్తి, ఆర్ఐ రమేష్, రెవెన్యూ సిబ్బంది, కళాశాల సూపరింటెండెంట్ అనురాధ, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

పిహెచ్‌సి వైద్యాధికారిగా పూజ్య మేఘన బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- దేవరాపల్లి : దేవరాపల్లి పిహెచ్‌సి రెండో వైద్యాధికారిణిగా ఇ.పూజ్య మేఘన శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం పిహెచ్‌సి సిబ్బందితో సమావేశం నిర్వహించి ప్రస్తుతం సీజనల్ వ్యాధులపై గ్రామాలలో ఏమేమి చర్యలు తీసుకోవాలో తెలియజేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన వైద్య అధికారిని రైవాడ సర్పంచ్ చల్లా లక్ష్మీ నాయుడు, వైస్ ఎంపీపీ ఉర్రూకల గంగాభవాని అప్పారావు, యాదవ సంఘం నాయకులు బుద్దాల రమణ, చల్లా నానాజీ, దేవరాపల్లి ఎంపీటీసీ సభ్యులు మొల్లి కృష్ణమూర్తి, కిల్లన శ్రీనివాసరావు, కాగిత సూరిబాబు, తదితరులు సత్కరించారు.

అలరించిన కోలాటం

ప్రజాశక్తి- వడ్డాది : మండలంలోని విజయరామ రాజు పేటకు చెందిన కోలాటం బృందం ప్రదర్శన తిరుపతిలో విశేషంగా అలరించింది. పెంటకోట ధనలక్ష్మి ఆధ్వర్యంలో విజయరామరాజుపేట శ్రీసీతారాముల కోలాటం బృందం వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రదర్శనలు ఇచ్చింది. ఈ ప్రదర్శనలకు ప్రశంసలు వెల్లువెత్తాయి. రాష్ట్రస్థాయిలో అనేక ఆధ్యాత్మిక సాంస్కృతిక ప్రదర్శనలలో బహుమతులు లభించాయని పద్మ నాగమణి, పరిమళ, లక్ష్మి, గౌరీ, పుష్ప, జ్యోతి, రాణి, వేణు, నీలిమ, స్వాతి, సూర్య కళ, నూక రత్నం తెలిపారు.



కోలాటం ఆడుతున్న మహిళలు

రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకుంటే చర్యలు

ఆర్‌టిఐ రాష్ట్ర కమిషనర్ హరి ప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆర్‌టిఐ రాష్ట్ర కమిషనర్ హరిప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి- అనకాపల్లి

రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోతే ఉపేక్షించేది లేదని సమాచార హక్కు చట్టం రాష్ట్ర కమిషనర్ యు హరి ప్రసాద్ రెడ్డి హెచ్చరించారు. స్థానిక గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో గురువారం రాత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రిజిస్టర్ లేదా స్పీడ్ పోస్ట్ ద్వారా మాత్రమే దరఖాస్తుదారులకు సమాచారం పంపాలన్నారు. ప్రతి ప్రభుత్వ శాఖ స్వచ్ఛందంగా వెల్లడించాల్సిన ఆర్‌టిఐ చట్టం 4(1) (బి) తాజాపరచి వెబ్‌సైట్‌లో పొందుపరచాలని సూచించారు. అనకాపల్లి జిల్లాలో 28 ప్రభుత్వ శాఖలను ఆకస్మిక పరిశీలన చేయగా రిజిస్టర్లు సంతృప్తికరంగా లేవన్నారు. త్వరలో ఆర్టిఐ దరఖాస్తులను ఆన్లైన్లో స్వీకరించడం జరుగుతుందని, దీనివల్ల దరఖాస్తుదారునికి, అధికారులకు కాలం, ధనం ఆదా అవుతుందని చెప్పారు. విచారణకు హాజరుకాని పిఐఓలు తమ ప్రతినిధులుగా పూర్తి సమాచారం తెలిసిన వారిని పంపాలన్నారు. జాతీయస్థాయి అధ్యయనంలో సమాచార కమిషన్ల పనితీరు విషయంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అగ్ర స్థానంలో ఉందన్నారు. అనంతరం ఆయన నూకంబిక అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు శ్రీరామ్మూర్తి, సమాచార హక్కు చట్టం ఉద్యమకర్త కాండ్రేగుల వెంకటరమణ పాల్గొన్నారు.

సహజ వనరులతో అధిక దిగుబడులు



ఈ క్రాప్ ఫిజికల్ టెక్నాలజిమెంట్ రైతుకు అందిస్తున్న లీలావతి

ప్రజాశక్తి - కె.కోటపాడు

వ్యవసాయంలో సహజ వనలు ఉపయోగిస్తూ ఎప్పటికప్పుడు పొలం పరిసరాలను విశ్లేషిస్తూ చీడపీడలను నిర్మూలించుకుంటే నాణ్యమైన అధిక దిగుబడును సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారిని లీలావతి అన్నారు. పొలంబడి క్లస్టర్ లెవెల్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఏ.కోడూరు రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రైతు భరోసా, ఈ క్రాప్, ధాన్యం కొనుగోలు వంటి అన్ని సేవలను వ్యవసాయ సహాయకుల ద్వారా పొందాలని సూచించారు. పొలంబడి చేయు పద్ధతులను, అనుసరించవలసిన నియమాలను, చీడపీడ క్రిమిలను సకాలంలో నిర్మూలించే పద్ధతులను వివరించారు. రెండో పంటగా మొక్కజొన్న వేసుకున్నట్లయితే కలిగే లాభాలను జిల్లా శిక్షణ అధికారి చిరంజీవి వివరించారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న ఎరువులు, వాటి ఉపయోగాలను చోడవరం వ్యవసాయ సహాయ సంచాలకులు రవీంద్రనాథ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం అగ్రికల్చర్ ఆఫీసర్ విజేత, వ్యవసాయ అధికారి గాయత్రి. మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి అవసరాలకు రూ.156 కోట్లు ఖర్చు

ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

ప్రజాశక్తి- కె.కోటపాడు

మాడుగుల నియోజవర్గంలోని నాలుగు మండలాలలో మంచినీటి అవసరాల కోసం రూ.156 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతులు బట్టి నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఏ ఒక్క పని అసంపూర్తిగా ఉండరాదని ఆదేశించారు. ప్రతి గ్రామానికి అభివృద్ధి కొరకు మంజూరు చేసిన నిధులను ప్రజలకు తెలియజేసే విధంగా ఆయా గ్రామాల నాయకులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలలో ప్రాధాన్యత బట్టి పనులను గుర్తించి వాటిని నెరవేర్చే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మండలంలో మొదటి విడతలు అన్ని రోడ్లను పూర్తి చేశామని, లింక్ రోడ్లను కూడా తారు రోడ్లుగా మార్చనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీడీవో కాండ్రేగుల శశిదేవి, తహశీల్దారు రమేష్ బాబు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

అభ్యసన మెరుగుదలపై శిక్షణ

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అభ్యసన మెరుగుదల కార్యక్రమం (లెర్నింగ్ ఇంప్రోవింగ్ ప్రోగ్రాం)ను కోర్సు డైరెక్టర్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం సిహెచ్.చిన్నమ్మాయి అధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో 6, 7, 8 తరగతుల ఆంగ్లం, తెలుగు భోదిస్తున్న సబ్బవరం, చోడవరం, కె.కోటపాడు మండలాలకు చెందిన ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. పరిశీలకులుగా వచ్చిన మండల విద్యా శాఖాధికారి ఎస్.అప్పలరాజు మాట్లాడుతూ విద్యార్థులు వారు చదువుతున్న తరగతులకు సంబంధించిన కనీస సామర్థ్యాలు సాధించకుండా పైతరగతులకు వెళితే చదువుపై ఆసక్తి కోల్పోయి బడికి దూరమై డ్రాప్ అవుట్‌గా మారుతారని తెలిపారు. పిల్లల వెనకబాటుతనం సమాజాభివృద్ధి, ఆర్థికాభివృద్ధిపై తీవ్రప్రభావం చూపుతుందని చెప్పారు. అందువల్ల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడానికి ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంగ్లం డిఆర్‌పి జి.విశ్వనాథరాజు, తెలుగు డిఆర్‌పి వి.భిక్షులయ్య, మండల రిసోర్స్ పర్సన్ కళాభారతి, నాగమణి, రామలక్ష్మి, రమణ పాల్గొన్నారు.

ఘనంగా గిరీష్ అయ్యప్ప జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి : తెలుగుదేశం పార్టీ యువజన నాయకులు బొడ్డేడ గిరీష్ అయ్యప్ప జన్మదిన వేడుకలు శుక్రవారం టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేకు కట్ చేసి మెమెంటో, దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా గిరీష్ అయ్యప్పకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులు సూరే సతీష్, దొడ్డి జగదీష్, మల్ల గణేష్, చదరం శివ, పెంటకోట శివరాం, పీలా శ్యామ్, పొలిమేర నాయుడు, పాల్గొన్నారు.

27న జంగమ కులస్తుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి రెవెన్యూ డివిజన్ జంగమ కులస్తుల ఆత్మీయ కలయిక, వన సమారాధన ఈనెల 27న నిర్వహిస్తున్నట్లు సంఘం ప్రచార కార్యదర్శి లోకనాథం రఘురాం తెలిపారు. సంఘ కార్యాలయంలో శుక్రవారం ఆయన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పూడి వీరబాబు, పతివాడ వరహామూర్తి, అత్తిలి శ్రీనివాసరావు, కోరుకొండ వసంత రావు, రమణమూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి కిలపర్తి రాజేశ్వరి

ప్రశాంతంగా మండల సమావేశం

ప్రజాశక్తి- దేవరాపల్లి : ఎంపిపి కిలపర్తి రాజేశ్వరి అధ్యక్షతన శుక్రవారం మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం ప్రశాంతంగా జరిగింది. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అన్ని శాఖల అధికారులు శాఖల వారీగా ప్రజాప్రతినిధులకు తెలియజేశారు. అనంతరం ఎంపిపి రాజేశ్వరి మాట్లాడుతూ వికేంద్రీకరణకు మద్దతుగా తీర్మానం ప్రవేశపెట్టగా, మండల సమావేశం ఆమోదించింది. దేవరాపల్లి నుంచి ఆనందపురం వెళ్లే రోడ్డు మార్గం వేగంగా పూర్తి చేసినందుకు డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు కర్రి సత్యం, తహశీల్దార్ ఎం.లక్ష్మి, ఇంచార్జ్ ఎంపీడీవో జివి.రమణ, 27 పంచాయితీల సర్పంచులు, ఎంపిటిసిలు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి కృషి : ఎంపిపి

ప్రజాశక్తి- కె.కోటపాడు : ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు సహకారంతో మండలాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎంపిపి రెడ్డి జగన్ మోహన్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 32పంచాయితీల్లో మెరుగైన రహదారులు, ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. లంకవానిపాలెం సర్పంచ్ దొరబాబు మాట్లాడుతూ తమ గ్రామంలోని ఆసుపత్రికి వెళ్లే రహదారిలో విద్యుత్ సౌకర్యం లేక లైట్లు వేయలేక పోతున్నామని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మండల కేంద్రం నుంచి అనకాపల్లి, విశాఖకు బస్సులు ఏర్పాటు చేయాలని మండల సమావేశంలో తీర్మానం చేశారు. వీటిని ఆర్టీసీ అధికారులకు అందజేయనున్నట్లు ఎంపిపి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యకాస జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ

వ్యకాస మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-సబ్బవరం : ఎపి వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఎన్నిక శుక్రవారం సంఘం జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ సమక్షంలో జరిగింది. సంఘం మండల అధ్యక్షులుగా కన్నేపల్లి కోటేశ్వరరావు, కార్యదర్శిగా ఉప్పాడ సత్యవతి, సభ్యులుగా లావేటి ఎర్రయ్య, గండ్రేడ్డి నరసమ్మ, ఎస్.దేముడమ్మ, యర్రా సోమేష్, బొబ్బరి సన్యాసమ్మ, గవర రాము నాయుడు, ఎన్.నూకరాజు, వడిశల నూకరాజు ఎన్నికయ్యారు.

40 మందిపై బైండోవర్

ప్రజాశక్తి-చోడవరం : ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు మండలంలో జన్నవరం, గజపతినగరం గ్రామాలకు చెందిన 40 మందిని బైండోవర్ చేయడం జరిగిందని స్థానిక సిఐ బి శ్రీనివాసరావు తెలిపారు. ఆయా గ్రామాల్లో ఇసుక రవాణాకు పాల్పడుతున్న వారికి సహకరించిన వ్యక్తులను బైండ్ అవుట్ చేశామన్నారు. ఇకపై ఎవరైనా గ్రామంలో ఇసుక తరలింపుకు పాల్పడితే సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ శ్రీనివాసరావు తెలిపారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న సిఐ శ్రీనివాసరావు

నిరుపయోగంగా వసతి గృహం

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-కోటవురట్ల: మండల కేంద్రంలో సాంఘిక సంక్షేమ శాఖ బీసీ హాస్టల్ గడిచిన నాలుగు సంవత్సరాలుగా వృధా ఉంది. ఆనాటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి సుమారు రూ.50 కోట్లతో నిర్మించిన ఈ హాస్టల్ భవనం ఎంతో అట్టహాసంగా ప్రారంభించారు. నేడు అది వృధాగా ఉండటం పట్ల స్థానికులు సైతం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. భవనం ప్రారంభించిన తరువాత హాస్టల్ నిర్వహించక పోవడంతో ప్రస్తుతం ఆ భవనం సరైన నిర్వహణ లేక విలువైన కిటికీలు ధ్వంసం అయ్యాయి.ఈ భవనానికి ఏర్పాటుచేసిన విద్యుత్ సోలార్ సైతం పాడైన పరిస్థితి నెలకొంది.

ఇదిలా ఉండగా ప్రస్తుతం నిర్వహిస్తున్న బాలికల వసతిగృహం శిథిలావస్థకు చేరుకుంది. ప్రస్తుతం అందులో దాదాపు 150 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఈ వసతి గృహానికి సరైన రక్షణ కూడా సైతం లేకపోవడం విశేషం. విలువైన భవనాన్ని వృధాగా వదిలి శిథిలావస్థలో ఉన్న భవనంలో విద్యార్థులు వసతి పొందడం పట్ల స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.


బిసి వసతి గృహం

అధికారులు ఇప్పటికైనా స్పందించి వృధాగా ఉన్న భవనాన్ని అందుబాటులోకి తీసుకు రావాలని, అదేవిధంగా శిథిలమైన భవనానికి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


మొక్కను నాటుతున్న డిఎస్‌పి

కాంప్లెక్స్ ఆవరణలో మొక్కల నాటివేత

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో శుక్రవారం ఆర్టీసీ డిఎం ధీరజ్ నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా నర్సీపట్నం డిఎస్పీ ప్రవీణ్ కుమార్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంప్లెక్స్‌కి వచ్చిన ప్రయాణికులకు ఆహ్లాదకర వాతావరణన్ని కల్పించేందుకు మొక్కలు నాటామన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించడం మనందరి బాధ్యత అన్నారు. మొక్కలను నాటడంతో కాలుష్యం తగ్గుతుందని తెలిపారు. పర్యా వరణ సమతుల్యతకు చెట్లు ఎంతగానో దోహద పడతాయని చెప్పారు. చెట్లు స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను మనకు అందిస్తాయన్నారు. ప్రతి ఒక్కరు నాటిన మొక్కలను సంరక్షించాలన్నారు. చెట్లను నాటడం వాటిని పరిరక్షించడం సామాజిక బాధ్యతగా స్వీకరించాలని సూచించారు.

నర్సీపట్నం కబడ్డీ జట్టుకు ద్వితీయ స్థానం

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్: జగనన్న క్రీడా సంబరాల్లో భాగంగా అనకాపల్లిలో జరిగిన కబడ్డీ పురుషుల పోటీల్లో నర్సీపట్న కబడ్డీ టీమ్ ద్వితీయ స్థానం సాధించింది. ఫైనల్ మ్యాచ్లో యలమంచిలితో నర్సీపట్నం టీమ్ తలపడి రెండవ స్థానం సాధించింది. ఈ సందర్భంగా ద్వితీయ స్థానం పొందిన క్రీడాకారులు మాట్లాడుతూ, కబడ్డీ పోటీలు చాలా ఆస క్తికరంగా కొత్త టెక్నికల్ స్కిల్స్‌తో సాగాయన్నారు. నాక్ ఔట్ గేమ్‌లో కష్టంగా పోరాడామని, ఈసారి మొదటి స్థానం సాధిస్తామని తెలిపారు. క్రీడాకారులను శాప్ కోచ్ అబ్బు, కబడ్డీ కోచ్ మజ్జి సాయి, వెంకటహరినాథ్, తదితరులు అభినందించారు.


ద్వితీయ స్థానం సాధించిన క్రీడాకారులు


భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఇఒ

విద్యార్థులకు నాణ్యమైన భోజనం

ప్రజాశక్తి-కోటవురట్ల: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో నిర్లక్ష్యం వహించరాదని ఎంఈఓ అప్పారావు తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలో కొడవటిపూడి, గొల్లపేట పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు పరిశుభ్రమైన ప్రాంతంలో భోజనాలు అందజేయాలని సూచించారు. అదేవిధంగా గొల్లపేట పాఠశాలలో విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. అక్కడ జరుగుతున్న నాడు నేడు పనులను పరిశీలించారు. పనుల విషయంలో నాణ్యత లోపించరాదని ప్రధానోపాధ్యాయునికి సూచించారు.


హెూమం నిర్వహిస్తున్న పండితులు

ఘనంగా సుదర్శన హోమం

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలో ఉపమాక వెంకన్న గరుడాద్రి పర్వతంపై శుక్రవారం ఉదయం సుదర్శన హెూమం ఘనంగా నిర్వహించారు. కొండ దిగువన ఆలయం నుండి సుదర్శన పెరుమాళ్‌ను ఊరేగింపుగా గరుడాద్రి పర్వతంపై ప్రత్యేక అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం సుమారు 200 మందికి అన్న ప్రసాదములు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం విజయవాడ జోన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వెంకటయ్య, పలువురు భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభల పోస్టర్ విడుదల

ప్రజాశక్తి-యస్.రాయవరం: వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 29వ మహాసభల పోస్టర్‌ను సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.సత్యనారాయణ శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూమి పంచాలి, కూలి పెంచాలనే నినాదంతో జంగారెడ్డిగూడెంలో డిసెంబర్ 8, 9, 10 వ తేదీల్లో మహాసభలు జరుగుతాయని ఆయన తెలిపారు. 2004లో ప్రవేశపెట్టిన ఉపాధి హామీ చట్టాన్ని ప్రస్తుత ప్రభుత్వం నీరుగార్చడం శోచనీయమన్నారు. ఈ పథకానికి నిధులు తగ్గించడంతో ఉపాధి కూలీలు నష్ట పోతున్నారని ఆయన అన్నారు. 200 పని దినాలు కల్పించి రోజుకు రూ.600ల కూలీ ఇచ్చి ఉపాధి కూలిలను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అనకాపల్లి జిల్లా రావికమతం మండలంలో డిసెంబర్ 4 న జరిగే జిల్లా మహాసభలను ఉపాధి కూలీలు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు, తదితరులు పాల్గొన్నారు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు


ఊరేగిస్తున్న మహిళలు

నూకాలమ్మకు బోనాల సమర్పణ

ప్రజాశక్తి-యస్.రాయవరం: ధర్మవరం అగ్రహారం గ్రామదేవత నూకాలమ్మతల్లికి గ్రామస్థులు బోనాలు సమర్పించారు. శుక్రవారం ఉదయం అమ్మవారి ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పాతధర్మవరం, కొత్తధర్మవరం గ్రామాలకు చెందిన మహిళలు పసుపు, కుంకుమ సారె చీరలతో పాటు బోనాలతో ఊరేగించారు.ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు పాల్గొన్నారు.

వైసిపిలో పలువురు చేరిక

ఆహ్వానించిన ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: మండలంలోని ధర్మ సాగరం గ్రామంలో గల పలు టిడిపి కుటుంబాలు వైసిపి తీర్థం పుచ్చుకున్నాయి. నర్సీపట్నం శాసన సభ్యులు పెట్ల ఉమాశంకర్ గణేష్ సమక్షంలో పార్టీలో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు పార్టీలతో సంబంధం లేకుండా అందరికీ అందిస్తున్న ఘనత వైసిపికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షులు, ధర్మసాగరం సర్పంచ్ గొంప కన్నయ్యనాయుడు, వైస్ ఎంపీపీ రమణ, గ్రామ పెద్దలు యూత్ సభ్యులు పాల్గొన్నారు.


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గణేష్

28న గడప గడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-నాతవరం: మండలంలోని సృంగారం గ్రామంలో ఈనెల 28న సోమవారం 9 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తామని వైసీపీ మండల అధ్యక్షులు పైల పోతురాజు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ కార్యక్రమానికి నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ హాజరవుతారన్నారు.వైస్ ఎంపీపీలు, ఎంపిటీసీలు, సర్పంచులు, నాయకులు ఈ కార్యక్రమంలో భాగ స్వాములు కావాలని కోరారు.


శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలో వేంపాడు గ్రామంలో శుక్రవారం సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు గ్రామ ప్రజా ప్రతినిధులు శంకుస్థాపన చేశారు. మండల పరిషత్ ఎంపీటీసీ నిధులతో ఎంపీటీసీ కుంచే మధు ఆధ్వర్యంలో చేపట్టిన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు ఉప సర్పంచ్ అయినంపూడి అప్పలరాజు తదితరులు శంకుస్థాపన చేశారు. రోడ్డు లేకపోవడంతో రాకపోకలు సాగించడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే వారిని, ప్రస్తుతం నిర్మాణం చేపట్టడంతో ఇబ్బందులు తొలగనున్నాయని ప్రజాప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్లా రాంబాబు, శివరామకృష్ణన్ రాజు, పల్లా నాగరాజు, దారబాల అప్పారావు, ఇసరపు పాపారావు, మెంబర్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

భూ రీ సర్వేతో సమస్యలు పరిష్కారం

ఆర్‌డిఒ జయరామ్

ప్రజాశక్తి-గొలుగొండ:నర్సీపట్నం ఆర్డీవో హెచ్‌వి జయరామ్ శుక్రవారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. ముందుగా పాతకృష్ణదేవిపేటను ఆనుకొని నిర్మాణం జరుగుతున్న నేషనల్ హైవే నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం సమగ్ర భూ సర్వే విధానంపై వివరాలను తహశీల్దార్ ఆనందరావును అడిగి తెలుసుకున్నారు. రీ సర్వేతో రైతులకు శాశ్వత భూ సమస్య పరిష్కారం దొరుకుతుందన్నారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో ఎంపిడిఒ ఎస్.డేవిడ్‌రాజు, తహశీల్దార్, వ్యవసాయ అధికారి సుధారాణితో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రాముఖ్యంగా తీసుకున్న సచివాలయాలు, రైతు భరోసా, హెల్త్ సెంటర్లు సకాలంలో పూర్తయ్యేలా చూడాలన్నారు. వరి కోతలు ప్రారంభం కావడంతో ధాన్యం కొనుగోలు ఆర్‌బిఎల్ ద్వారా జరగాలని, అందుకు తగిన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని ఏవోకు సూచించారు. ఓటర్ నమోదు, ఆధార్ అనుసంధానం, ఎమ్మెల్సీ ఓట్ల నమోదు ఎన్నికల నియమావళి అనుసరించి నిర్దేశించిన సమయంలో పూరి ్తచేయాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. ఆర్డీవో వెంట డిఐఓఎస్‌లు, మండల సర్వేయర్ చినబాబు, సహాయక సిబ్బంది ఉన్నారు.


సర్వేను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ


నిరసన చేపడుతున్న కార్మికులు

ప్రభుత్వ విధానాలపై ఎస్‌డబ్ల్యుఎఫ్ నిరసనలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆర్‌టిసికి నష్టం చేకూర్చే ప్రభుత్వ విధానాలపై శుక్రవారం మద్దిలపాలెం, వాల్తేరు డిపోల వద్ద స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన నిరసన కార్యక్రమాలు చేపట్టారు. సంఘం జిల్లా కార్యదర్శి కె.నాయుడు, రాష్ట్ర నాయకులు సీతామహాలక్ష్మి మాట్లాడారు. ఆర్‌టిసి కార్మికులకు 2017 నుంచి రావలసిన ఎరియర్స్ పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని, అద్దె బస్సుల కొనుగోలును ఆపాలని డిమాండ్ చేశారు. సంస్థను బలోపేతం చేసే నిర్ణయాలు తీసుకోవాలన్నారు. కార్పొరేట్ తరహా వైద్య సదుపాయం, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో రీజనల్ ప్రెసిడెంట్ పిఎస్.నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బిల్డర్స్ డే

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ:బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా విశాఖపట్నం సెంటర్ ఆధ్వర్యంలో బిల్డర్స్ డే 2022 వేడుకను 'కనస్ట్రక్షన్ ఇండస్ట్రీ టర్నింగ్ వేస్టు టు వెల్త్' థీమ్‌తో నగరంలోని ఓ ప్రముఖ హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన ఐఐపిఇ మాజీ వ్యవస్థాపక డైరెక్టర్ వివిఎస్‌ఆర్‌కె.ప్రసాద్ గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రసంశా పత్రాలు అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బిల్డర్స్ డే ప్రాధాన్యతను వివరించారు. ఎపి బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ ఎ.కాశీ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాలో మూడు నెలకొకసారి జరిగే ఎంసి అండ్ జిసి సమావేశం వివరాలను సభ్యులకు తెలియజేశారు. అసోసియేషన్ కార్యకలాపాలను, గొప్పతనాన్ని, నూతనంగా ఏర్పాటు చేసిన కడప, రాయలసీమ సెంటర్ల వివరాలను తెలియజేశారు. పెండింగ్ బిల్లుల వివరాలను పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు బి.రాఘవరావు, డాక్టర్ కుమార్ రాజా, డాక్టర్ విజయకుమార్, ఆర్.సత్యనారాయణ, సి.బాల సతీష్, ఎ.చిన్నారావు రెడ్డి, జివి.సుబ్బారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాశీవిశ్వేశ్వరరావు



మాట్లాడుతున్న ఎంఇఒ

విద్యార్థులకు నాణ్యమైన విద్య

ప్రజాశక్తి- చీడికాడ: విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించాలని మండల విద్యాశాఖ అధికారి గంగరాజు కోరారు. బోధన పద్ధతులపై (లిప్)అభ్యాసనా అబివృద్ధి కార్యక్రమంలో భాగంగా శిక్షణా కార్యక్రమం చీడికాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6,7,8 తరగతుల తెలుగు, ఆంగ్లం ఉపాధ్యాయులకు శుక్రవారం నిర్వహించాఉ. మండల విద్యాశాఖ అధికారి గంగరాజు మాట్లాడుతూ, విద్యార్థులకు బోధన పద్ధతులులో తెలుగు, ఇంగ్లీష్ బోధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోర్స్ కోర్డినేటర్ గాలి అప్పారావు, రిసోర్స్ పర్సన్‌లు కె.గోవిందరావు, వి.నాగేశ్వరరావు. ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఆర్‌డిఒ

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ :గర్భిణీ స్త్రీలకు లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని రెవిన్యూ డివిజనల్ అధికారి జయరాం తెలిపారు. ఆర్డీవో అధ్యక్షతన లింగ నిర్ధారణ కమిటీ సమావేశం ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేశారు. లింగ నిర్ధారణ చేసిన, చేయుంచుకున్న వారిపై చట్ట ప్రకారం నేరంగా పరిగణించి తగు చర్య తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ జ్యోతి, శ్రీనివాసరావు, న్యాయవాదులు శ్రీ ప్రహ్లోద, గంగరాజు, శివకుమార్ పాల్గొన్నారు.

సినీ నటుడు కృష్ణకు ఘన నివాళి

ప్రజాశక్తి -కొత్తకోట: సూపర్ స్టార్ కృష్ణ మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. శుక్రవారం కృష్ణ వేష దారుడు, పలు సాంఘిక నాటకాలతో పాటు రికార్డింగ్ డాన్స్‌ల్లో ఆయనను అనుకరించిన కొత్తకోట గ్రామానికి చెందిన అభిమాని మల్లి సాంబమూర్తి ఆధ్వర్యంలో స్థానిక మెయిన్ రోడ్డులో ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవ, వైసీపీ మండల కార్యదర్శి శీలం శంకరరావు తదితరులు మాట్లాడుతూ సుమారు 350 చిత్రాలకు పైగా నటించి చరిత్ర సృష్టించారని కొనియాడారు. అనంతరం కృష్ణ చిత్ర పటానికి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక అభిమాన సంఘం సభ్యులు పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న అభిమాన సంఘం సభ్యులు



మాట్లాడుతున్న తహశీల్దార్

ఓటు హక్కుపై అవగాహన

ప్రజాశక్తి -మాకవరపాలెం:మండలంలోని తామరం అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం తహసిల్దార్ ప్రసాద్‌రావు విద్యార్థులకు ఓటు హక్కు నమోదు పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో చాలా కీలకమని, దీనిని వినియోగించుకోవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మోహన్‌రావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు

ప్రజాశక్తి -రావికమతం:మండలంలోని కవగుంట పంచాయతీ యాదవ కాలనీలో డ్రెయినేజీలో పూడికపోయిన చెత్తా చెదారాన్ని సర్పంచ్ సూర్య కుమార్ వరహాలు ఆధ్వర్యంలో శుక్రవారం తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ఆర్థిక సహకారాన్ని అందిస్తే పూర్తిస్థాయిలో గ్రామాభివృద్ధి చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. గ్రామాలలో డ్రైనేజీ, పంట కాలవలు, చెరువుల అభివృద్ధి, మధుముల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు.

వచ్చే నెలలో సిఎంతో శంకుస్థాపనలు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్ :డిసెంబర్ నెలలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నియోజకవర్గంలోని మాకవరపాలెంలో రూ.500 కోట్ల ఖర్చుతో మెడికల్ కాలేజీకి, అలాగే రూ.472 కోట్లతో తాండవ ఏలేరు కాలువ ఎత్తిపోతల పథకంకు శంఖుస్థాపన చేయనున్నారని ఎమ్మెల్యే గణేష్ తెలిపారు. ఈ వివరాలు మీడియాకు వీడియో ద్వారా తెలియజేశారు. ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని, ఆయ కట్టు భూములకు నీరు అందేలా సిఎం ప్రణాళికలు చేస్తున్నారని తెలిపారు. వైఎస్‌ఆర్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమన్నారు.గడప గడపకు కార్యక్రమంలో భాగంగా పలు మండలాల్లో గ్రామాలు తిరిగామని, కావలసిన అవసరాలను గుర్తించి సీఎం దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీనిలో భాగంగానే ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు అభివృద్ధి పనులు నిమిత్తం విడుదల చేశారని తెలిపారు.శంకుస్థాపన కార్యక్రమాలకు పెద్ద ఎత్తున ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -రావికమతం:మండలంలో తట్టబంద గ్రామ పంచాయతీలో డ్రైనేజీ, సిసి రోడ్డు పనులకు సర్పంచ్ గోకివాడ రమణ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమణ మాట్లాడుతూ, రూ.15లక్షల గ్రామ పంచాయతీ నిధులతో డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మిగిలిన సిసి రోడ్లను, డ్రెయిన్లను పూర్తి చేయడం జరుగుతుందన్నారు.


పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

అందని ఉచిత రేషన్ బియ్యం

ప్రజాశక్తి-కోటవురట్ల:కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత రేషన్ బియ్యం నేటికీ పలు గ్రామాల్లో అందకపోవడం పట్ల లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలానికి సంబంధించి 38 డిపోలు ఉండగా ఇంతవరకు కొన్ని గ్రామాల డిపోలకు మాత్రమే ఉచిత రేషన్ బియ్యం అందినట్లు లబ్ధిదారులు తెలిపారు. కోటవురట్ల సహా మాకకరపాలెం మండలాల డిపోలకు కోటవురట్ల గోదాము నుండి నుంచి సరఫరా చేస్తూ ఉంటారు. రెండు మండలాలకు కలిపి 86 కేంద్రాలు ఉండగా ఇంతవరకు 48 కేంద్రాలకు మాత్రమే సరఫరా చేసినట్లు గోదాము ఇంచార్జి ఈశ్వర్ తెలిపారు. ఇంకా కోటవురట్లలోని 13 డిపోలకు, మాకవరపాలెం మండలంలోని 25 డిపోలకు ఉచిత రేషన్ సరఫరా చేయాల్సి ఉంది.

వర్షంతో తడిసిన ధాన్యం

ప్రజాశక్తి -రావికమతం:గురువారం రాత్రి కురిసిన కొద్ది పాటి వర్షానికి రైతులు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల కాలంగా ఎండలు మెండుగా కాయడంతో పండిన వరి పంటను రైతులు కోతలు మొదలుపెట్టారు. ఒక్కసారిగా వర్షం పడటంతో ఏమి చేయాలో తెలియక దిక్కుతోచని పరిస్థితుల్లో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 28 గ్రామ పంచాయతీలోను ప్రతి గ్రామంలో 20 మంది రైతులకు తక్కువ కాకుండా పండిన వరి పంటను కోతలు కోయడం మొదలు పెట్టారు. తడిసిన పంట నిల్వ ఉంచుకో వడానికి, నూర్పు చేయడానికి, అమ్ముకోవడానికి పనికిరాదని దీనిని తన ఇంటికి చేర్చుకోవడం కూడా చాలా కష్టతరమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే గురువారం రాత్రి కురిసిన వర్షానికి తడిసి ముద్దయిన వరి పంట రైతులను గుర్తించి వారికి తగు న్యాయం చేయాలని పలువురు కోరారు.

